


ఆందోళనను అధిగమించడానికి నాలుగు మార్గాలు ఉన్నాయి. మొదటి మార్గం ఏమిటంటే, ఈ ఆందోళన మీకు మొదటిసారి కలగలేదని గుర్తించడం. గతంలో కూడా మీకు ఇలాంటి అనుభవాలు ఎదురై ఉంటాయి. వెనక్కి తిరిగి చూస్తే, అప్పట్లో మీరు ఎందుకు అంతగా ఆందోళన చెందారో అని మీకే చాలా తెలివితక్కువగా అనిపిస్తుంది. కాబట్టి, మీ సొంత అనుభవాలను గమనిస్తే, ప్రస్తుతం మీరు అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మీకు ఒక గొప్ప పాఠం లభిస్తుంది. రెండవ విషయం ఏమిటంటే, ప్రతిదీ మారుతూ ఉంటుందని గ్రహించడం. ఈ పరిస్థితి కూడా మారుతుంది; ఇది ఎప్పటికీ మీతోనే ఉండదు. మూడవ విషయం, మీలో ఉన్న ధైర్యాన్ని మేల్కొల్పడం. "అవును, నేను దీన్ని ఎదుర్కోగలను! ఏమైంది మరి?" అని అనుకోండి. మీలోని ధైర్యాన్ని మేల్కొల్పినప్పుడు, ఆందోళన మాయమైపోతుంది. కోపం తెచ్చుకోగల సామర్థ్యం ఉన్న ఎవరికైనా ధైర్యాన్ని కూడా ప్రదర్శించే శక్తి ఉంటుంది; ఎందుకంటే కోపం అనేది ధైర్యానికి ఒక ప్రతిబింబమే.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ

ప్రజా దీవెన

www.prajadeevena.com

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 08 | ఆదివారం | 15 నవంబర్ 2026 | పేజీలు : 04 వెల ₹ 5



మోహిత్ మెరుపు ఇన్నింగ్స్

ఫైనల్లో పాకిస్థాన్ చిత్తు

ఒక్క వికెట్ తేడాతో ఆఖరి బంతికి పాకిస్థాన్‌పై గెలుపు

తొమ్మిదోసారి విజేతగా నిలిచిన యంగ్ ఇండియా

ఒక్క వికెట్ తేడాతో పాకిస్థాన్‌పై థ్రిల్లింగ్ విక్టరీ

7



ఇండో-పాక్ సమరం మరోసారి అసలు సిసలు క్రికెట్ మజాను పంచింది. అత్యంత ఉత్కంఠగా సాగిన ఫైనల్ ఫైట్‌లో.. ఆఖరి బంతికి పాక్‌కు పంచ్ ఇచ్చిన యువ భారత్, అండర్-19 ఆసియా కప్‌ను దక్కించుకుంది. 338 పరుగుల భారీ ఛేదనలో ఓ దశలో 252/8తో ఓటమి అంచున నిలిచిన భారత్‌కు.. మోహిత్ 'హీరో'చిత పోరాటంతో ఆపద్భాందవుడయ్యాడు. ఇక, చివరి బంతికి 3 రన్స్ కావాల్సిన వేళ ఫోర్ బాది జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

అందరికీ ఆత్మపరిశీలన అవసరం

ఇప్పటికే మోదీ, అమిత్ షాల్లో ఓటమి భయం చూశాం

2014 ఎన్నికల్లో కోట్లు కుమ్మరించి.. సరికొత్త ప్రచార పద్ధతులు, నాటకీయ రాజకీయ వ్యూహాలకు తెర

కారణాలను అర్థం చేసుకోవడానికి దశాబ్దం పట్టింది

ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఆందోళనకరం

రాజకీయాల్లో దశాబ్దంగా నెలకొన్న సంక్షోభానికి ఇదే కారణం

రాజకీయ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయమిదే

భారత్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

మమ్మల్ని ఆపగలమని అనుకుంటే అది వారి భ్రమే: రేవంత్ రెడ్డి



ప్రజా దీవెన, హైదరాబాద్ : "ద్వేషించం.. అసహ్యించుకోం.. అణచివేయం.. అవమానించం.. విద్వేషం, హింస లేకుండా.. ప్రేమ, కరుణ, సత్యం, అహింసలే మేము ఎంచుకున్న మార్గం. మా సిద్ధాంతాలతోనే బీజేపీని ఓడిస్తాం. కచ్చితంగా, పూర్తి నమ్మకంతో చెబుతున్నాం. రానున్న ఎన్నికల్లో మోదీని ఓడిస్తాం. ఇది ఇప్పటికే నిశ్చయమైపోయింది" అని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. న్యూఢిల్లీతోపాటు పలు ప్రాంతాల్లో జరిగిన నిరసనల సందర్భంగా మోదీ, అమిత్ షాల్లో ఓటమి భయాన్ని ఇప్పటికే చూశామన్నారు. దేశంలో ఫాసిస్టు శక్తులను ఓడించడానికి ప్రగతిశీల శక్తులన్నీ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. భారత్ సమ్మిట్ 2.0 ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన

మిగతా 2 లో

గిగ్ వర్కర్లకు ఆరోగ్యభీమా అమలు

గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా

10లక్షల ఆరోగ్య బీమా అమలు చేసేలా చట్టం

ప్రతి డెలివరీ చార్జీలో 1శాతం.. వారి భవిష్యత్తు కోసం

'గిగ్ వర్కర్ల చట్టం' ప్రారంభోత్సవంలో రాహుల్

గాంధీ కుటుంబం మాటిస్తే.. అది చట్టంతో సమానం

కార్మికులకు అధికారిక గుర్తింపు కార్డులు: రేవంత్

గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్, రేవంత్ బైక్ ర్యాలీ



తెలంగాణకు కాంగ్రెస్ ఓ చీడపీడ

అబద్ధాలను మించిన 'అభయహస్తం'

తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం అంతులేనిది

హామీలన్నీ బూటకం..అన్నివర్గాలకు తీవ్ర మోసం

420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జవాబు చెప్పాలి

బీసీలకు రూ.లక్ష కోట్ల బడ్జెట్ హామీ ఏడబోయింది?

మూడేండ్లలో ఖర్చు చేసింది రూ.5 వేల కోట్లలోపే

ఎస్సీ, ఎస్టీలకు 31 శాతం కాంట్రాక్టులు, బీసీలకు 42 శాతం వాటా హామీలు అమలుకు నోచుకోలేదు

విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఏదీ?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు

3

తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం అంతులేనిదని, ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.

నీటి హక్కుల కోసం నిర్దిష్ట ప్రజాఉద్యమం

సమ్మక్క సారలమ్మ డీపీఆర్‌ను వెనకి పంపడం అన్యాయం: హరీశ్‌రావు

968 టీఎంసీల హకుపై ప్రధాని నుంచి హామీ తేవాలి

తెలంగాణ నీటి హకుల కోసం బీఆర్ఎస్ మరో ప్రజా ఉద్యమం

రేవంత్, ఉత్తమ్ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో హరీశ్‌రావు ధ్వజం



రాష్ట్ర కాంగ్రెస్‌కు ఇన్‌చార్జిగా బీఎం సందీప్

మీనాక్షి నటరాజన్ స్థానంలో కర్ణాటక నేత..

పార్టీ మరింత బలోపేతం: మహేశ్



2

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా బీఎం సందీప్ నియమితులయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శిగా ఉన్న ఆయన నియామకానికి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదముద్ర వేసినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.



అగ్రరాజ్య అధినేతల అలాయ్ బలాయ్

ఒకే వేదికపై ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్

4

వచ్చే వారం భేటీ.. ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించే సమావేశమా?

అణ్వాయుధ నియంత్రణపై ట్రంప్ ప్రతిపాదన.. ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్ వ్యూహం

ప్రపంచాధిపత్య పోటీలో చైనా కీలక పాత్ర..ఇరాన్ యుద్ధంపైనా చర్చలు?

హస్తినలో ఆందోళనల అనుమతులపై ఆంక్షలు

50 వేల మందికే అనుమతి..

సమయాలపైనా పరిమితులు

ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకే సభలు, నిరసనలు

10 రోజుల ముందుగానే పోలీసులకు దరఖాస్తు చేయాలి

మారణాయుధాలపై నిషేధం.. డ్రోన్లకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ముసాయిదా ఎస్ఓపీ సిద్ధం చేసిన ఢిల్లీ పోలీసులు



4

రాష్ట్ర కాంగ్రెస్‌కు ఇన్‌చార్జిగా బీఎం సందీప్

మీనాక్షి నటరాజన్ స్థానంలో కర్ణాటక నేత..

పార్టీ మరింత బలోపేతం: మహేశ్



ప్రజా దీవెన, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా బీఎం సందీప్ నియమితులయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శిగా ఉన్న ఆయన నియామకానికి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదముద్ర వేసినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటి వరకూ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షీ నటరాజన్ వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఆమె స్థానంలో బీఎం సందీప్ బాధ్యతలు చేపట్టనున్నారు. లండన్ యూనివర్సిటీలో అర్థశాస్త్రంలో కోర్సు చేసేందుకు మీనాక్షీ నటరాజన్ బ్రిటన్‌కు వెళ్లినప్పుడే కొత్త ఇన్‌చార్జి నియామకం జరగనుందన్న ప్రచారం జరిగింది. కానీ, ఎవరినీ నియమించకపోవటంతో మీనాక్షినే కొనసాగిస్తారన్న అభిప్రాయాలూ వ్యక్తమయ్యాయి. మొత్తానికి, ఏఐసీసీ ఈ అనిశ్చితికి తెరదించుతూ కొత్త ఇన్‌చార్జిగా బీఎం సందీప్‌ను నియమించింది. సందీప్‌కు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ అభినందనలు తెలిపారు. గత ఇన్‌చార్జి మీనాక్షి తెలంగాణలో పార్టీ బలోపేతానికి, సంస్థాగత నిర్మాణానికి కృషి చేశారని, సందీప్ ఇన్‌చార్జిగా పార్టీ మరింత బలపడుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్నికల వ్యూహకర్తగా పేరు

బీఎం సందీప్ కుమార్ స్వస్థలం కర్ణాటకలోని చిక్‌మగళూరు. ఎన్నికల వ్యూహకర్తగా ఆయనకు పేరుంది. చిక్‌మగళూరు మునిసిపల్ కౌన్సిలర్‌గా ఒకసారి ఎన్నికయ్యారు. యూత్ కాంగ్రెస్‌లో పని చేశారు. అనంతరం, పార్టీలో మహారాష్ట్ర ఏఐసీసీ ఇంచార్జి కార్యదర్శిగా, గుజరాత్, దాద్రానగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూ ప్రాంతాలకు పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణకు నియమితులు కావటానికి ముందు వరకూ కేరళ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా ఉన్నారు. ఇప్పటి వరకూ అసెంబ్లీ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ ఎన్నికల్లో సందీప్ పోటీ చేయలేదు. పూర్తిగా పార్టీ సంస్థాగత బాధ్యతల్లోనే ఉన్నారు.

గర్జిస్తోన్న చలిపులి

కోహీర్‌లో 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

హైదరాబాద్‌లో 18.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు

ప్రజా దీవెన, హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. శనివారం హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 18.2 డిగ్రీల సెల్సియస్‌గా ఉండగా.. గరిష్ఠ ఉష్ణోగ్రత 30 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఉష్ణోగ్రతలు తగ్గుతుండటంతో చలి తీవ్రత పెరుగుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా చలి ప్రభావం రోజురోజుకూ అధికమవుతోంది. వారం రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఈ సీజన్‌లోనే అత్యల్పంగా శనివారం ఉదయం కోహీర్‌లో 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, కంగ్టి ప్రాంతాల్లోనూ చలి తీవ్రత కనిపిస్తోంది. శనివారం ఉదయం నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా: కోహీర్ 11, సత్వార్ 11.7, అల్గోల్ 11.9, మల్చెల్మ 12.4, కంగ్టి 12.6, మొగుడంపల్లి 12.7, న్యాల్‌కల్ 13, జహీరాబాద్ 14.1, ఝరాసంగం 14.7, నారాయణఖేడ్ 15.1, సంగారెడ్డి 16.6 డిగ్రీల సెల్సియస్.

మెదక్ జిల్లా: చిట్కుల్ 12.8, లింగాయిపల్లి 13.2, నాగాపూర్ 13.3, బుజరంపేట్ 13.5, పాతూర్ 13.5, కౌడిపల్లి 13.5, టేక్మాల్ 14, మెదక్ 15.5, నర్సాపూర్ 15.6 డిగ్రీల సెల్సియస్.

సిద్దిపేట జిల్లా: నంగునూర్ 12.5, మునిగడప 12.7, కొండపాక 12.8, కొడకండ్ల 12.8, హబ్షీపూర్ 12.8, అంగడి కిష్టాపూర్ 13, గజ్వేల్ 14.1, హుస్నాబాద్ 14.9, సిద్దిపేట 16.4 డిగ్రీల సెల్సియస్.

కంగనాపై ఎఫ్ఐఆర్ నమోదు!

సోనియా గాంధీపై సోషల్ మీడియా పోస్టులే కారణం

ఫిర్యాదు చేసిన రిటైర్డ్ కెప్టెన్ అతుల్ శర్మ

ఎఫ్ఐఆర్ నమోదైనట్లు ధ్రువీకరించిన ఎస్పీ గౌరవ్ సింగ్

సిమ్లా: బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చిక్కుల్లో పడ్డారు. గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా హిమాచల్ ప్రదేశ్ పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. సిమ్లాలో శుక్రవారం ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. కంగనా రనౌత్ నవంబర్ 10న తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో గాంధీ కుటుంబానికి సంబంధించిన పాత వీడియోతో పాటు కొన్ని పోస్టులు చేశారు. సిమ్లాకు చెందిన రిటైర్డ్ కెప్టెన్ అతుల్ శర్మ ఈ నెల 12న హిమాచల్ ప్రదేశ్ డీజీపీకి ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. కంగనా పోస్టులపై సైబర్ ఫోరెన్సిక్ విశ్లేషణ జరిపించాలని కోరారు. దీంతో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 196(1)(బి), 353(2), 350(2) సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీల మరణాలకు సంబంధించి అనుమానాలు కలిగించే విధంగా వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదుదారు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కూడా అభ్యంతరకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. గాంధీ కుటుంబ సభ్యుల మరణాల నేపథ్యంలో సోనియా గాంధీ రాజకీయంగా ఎదిగారనే భావన కలిగించేలా పోస్టులు ఉన్నాయని ఫిర్యాదులో ఆరోపించారు. సిమ్లా పోలీస్ సూపరింటెండెంట్ గౌరవ్ సింగ్ ఎఫ్ఐఆర్ నమోదైన విషయాన్ని ధ్రువీకరించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోందని, సంబంధిత ఆధారాలను సేకరిస్తున్నామని ఆయన తెలిపారు.

ఇలాంటి వ్యాఖ్యలు కంగనాకు తగదు

హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి మీడియా సలహాదారు నరేశ్ చౌహాన్ కంగనా వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించారు. ఎంపీ హోదాలో ఉండి ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. మరోవైపు, బీజేపీ నేత, మాజీ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్ కంగనాకు మద్దతుగా స్పందించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ మాట్లాడే హక్కు ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం సోషల్ మీడియా పోస్టుల విషయంలో ఎంపిక చేసుకుని చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. కాగా, ప్రస్తుతం ఈ వ్యవహారం హిమాచల్ ప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

అందరికీ ఆత్మపరిశీలన అవసరం

మొదటి పేజీ తరువాయి

ప్రసంగించారు. "ఫాసిస్టు ధోరణులు కలిగిన రాజకీయ శక్తులను కోపం, ద్వేషం, హింసతో ఎదుర్కోలేం. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయ పార్టీల మధ్య కాదు. ఇది భిన్నమైన రెండు భావజాలాల మధ్య జరుగుతున్న సంఘర్షణ. ఒకవైపు తమకే అన్నీ తెలుసని, ఎదుటివారి మాట వినకుండా గట్టిగా అరుస్తూ ఆధిపత్యం చెలాయించే శక్తులు ఉన్నాయి. మరోవైపు ప్రశ్నించే తత్వం, వినే స్వభావం, సానుభూతి, వినయంతో వ్యవహరించే సమూహం ఉంది. సమాజంలోని ఆ చిన్న సమూహం తమకే అన్నీ తెలుసని, ప్రతి దానికీ తమ వద్దే సమాధానాలున్నాయని భావిస్తుంది. మెజారిటీ ప్రజలు మాత్రం ప్రశ్నిస్తూ, ఇతరుల అభిప్రాయాలను వింటూ, అవసరమైతే తమ తప్పులను దిద్దుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఈ రెండు వర్గాల మధ్యే అసలు పోరాటం జరుగుతోంది" అని వివరించారు. వ్యాపార, విద్యా, రాజకీయ రంగాల్లోనూ తమకే అన్నీ తెలుసనే భావనతో వ్యవహరించే వ్యక్తులు ఉంటారని, రాజకీయాల్లో ఇటువంటి ధోరణినే ఫాసిజంగా పరిగణిస్తామని వ్యాఖ్యానించారు. గత దశాబ్ద కాలంగా ఇటువంటి శక్తులు బలంగా చలామణి అవుతున్నాయని, విశాల ప్రజానీకం జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోలేక అయోమయానికి గురైందని అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా లౌకిక, ప్రగతిశీల ఉద్యమాలకు ఫాసిస్టు రాజకీయ శక్తుల నుంచి సవాళ్లు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రేమ, కరుణ, సత్యం, అహింస, పరస్పర గౌరవం పునాదులుగా కొత్త ప్రపంచ వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మహాత్మా గాంధీ బోధించిన అహింస, సత్యం అనే ఆయుధాలతో ముందుకు వెళుతున్నామని, ప్రస్తుత, భావి తరాల కోసమే పోరాటం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన పలువురు ప్రతినిధులకు క్షమాపణలు కోరుతూ.. వీరిని కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని, దేశంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా కొందరు రాలేకపోయారని విచారం వ్యక్తం చేశారు.

అట్టడుగు నుంచి రెండో స్థానానికి అదానీ

"దేశంలో బీజేపీ అధికారంలోకి రావడానికి ముందు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ధనికుల జాబితాలో 600వ స్థానంలో ఉన్నవారు.. మోదీ అధికారంలోకి రాగానే ప్రపంచ ధనికుల్లో రెండో స్థానానికి చేరుకున్నారు. విమానాశ్రయాలు, సిమెంట్, పోర్టులు, రోడ్లు, రక్షణ రంగాలను అదానీ చేతుల్లో మోదీ పెట్టారు. ఎన్నికల్లో భారీగా డబ్బు వెదజల్లే శక్తులు అడుగుపెట్టాయి. రాజకీయ వ్యవస్థలోకి కోట్లాది రూపాయలు కుమ్మరించారు. సరికొత్త ప్రచార పద్ధతులు, నాటకీయ రాజకీయ వ్యూహాలు తెరమీదికి వచ్చాయి. ఈ పరిణామాలు ప్రతిపక్షాలను తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురిచేశాయి. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు దాదాపు దశాబ్ద కాలం పట్టింది. క్రమంగా కారణాలను గుర్తించాం" అని రాహుల్ గాంధీ వివరించారు. ఇందుకు 2014 ఎన్నికలే ప్రధాన సాక్ష్యమని, అటువంటి ఎన్నికలను మునుపెన్నడూ చూడలేదని వ్యాఖ్యానించారు. ఆ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ధ్వంసమైందని, మిలియన్ల కొద్దీ డాలర్లను ఎన్నికల వ్యవస్థలోకి చొప్పించారని ఆరోపించారు. పోటాపోటీగా సాగిన ఎన్నికల్లో వెలువడిన ఫలితాలు దిగ్భ్రాంతికి గురిచేశాయని గుర్తు చేశారు. ఆ తర్వాత నుంచి ప్రజాస్వామ్య సంస్థలు, ఎన్నికల ప్రక్రియ



బలహీనపడుతున్నాయని చెప్పారు. "బీజేపీ ఆస్తులు 12 ఏళ్లలోనే 11 రెట్లు పెరిగాయి. ఎన్నికల్లో భారీ మొత్తంలో డబ్బు ప్రభావం చూపుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ నాయకులు మొదట తమను తాము, తమ పార్టీని, తమ సిద్ధాంతాలను ప్రశ్నించుకోవాలి. భారత రాజకీయాల్లో దశాబ్ద కాలంగా నెలకొన్న సంక్షోభానికి ఇదే ప్రధాన కారణం" అని అభిప్రాయపడ్డారు.

ఓటు వేసిన నెలల్లోనే గాయబ్!

2024 ఎన్నికల్లో ఓటు వేసిన కోట్లాది మందిని కొన్ని నెలల తర్వాత చెల్లని లేదా ఉనికిలో లేని ఓటర్లుగా పరిగణించే పరిస్థితి ఏవిధంగా ఏర్పడిందని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఓటర్ల జాబితాల్లో ఎన్నికల సంఘం చేసిన మార్పులపై అనుమానాలు వ్యక్తం చేశారు."మహారాష్ట్రలో ప్రతిపక్ష కూటమి పార్లమెంట్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిన మూడు నెలలకే రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అకస్మాత్తుగా భారీ సంఖ్యలో.. ఏకంగా 70 లక్షల కొత్త ఓటర్లు జాబితాలో చేరారు. ఆ ఓట్లు చేరిన చోటల్లా బీజేపీకి అనుకూల ఫలితాలు వచ్చాయి" అని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ఓటు వేసిన 14 కోట్ల మందిని కొన్ని నెలలకే ఓటరు జాబితా నుంచి తొలగించారని ఎన్నికల సంఘంపై మండిపడ్డారు. ఓటు వేసిన 14 కోట్ల మందిని ఆ తర్వాత జాబితా నుంచి తొలగించి, చట్టవిరుద్ధమైన ఓటర్లుగా ప్రకటించారని ఆరోపించారు. అలాంటప్పుడు ఆ ఎన్నికలు ఏవిధంగా చట్టబద్ధమవుతాయని ప్రశ్నించారు. ఈ పరిణామాలు ఎన్నికల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు. దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు క్రమంగా ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదకరంగా మారుతున్నాయని అన్నారు.

ప్రజలతో ప్రత్యక్ష సంబంధమే అసలైన బలం

"ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇంతకాలం ఉపయోగించిన సంప్రదాయ రాజకీయ సాధనాలతో ఆశించిన ఫలితాలు రాలేదు. మీడియా సమావేశాలు, ఇంటర్వ్యూలు, బహిరంగ సభలు వంటి ప్రజల్లోకి వెళ్లే మార్గాలన్నీ విఫలమయ్యాయి. ప్రధాని మోదీ, ఆయన పార్టీ 24 గంటలూ టెలివిజన్, సోషల్ మీడియాలో కనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్షాలకు కొత్త మార్గాలను అన్వేషించాల్సిన అవసరం, అనివార్యత ఏర్పడింది. ఈ క్రమంలో ఓ కీలక విషయాన్ని గుర్తించాం. వ్యవస్థలపై ఎంతటి నియంత్రణ ఉన్నా, ఎంత డబ్బు ఉన్నా ప్రజలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండటమే అత్యంత శక్తిమంతమైన ఆయుధం. అందుకే కాంగ్రెస్ పార్టీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రజల మధ్యకు వెళ్లే కార్యక్రమాన్ని చేపట్టింది" అని రాహుల్ గాంధీ వివరించారు. రాజకీయాల్లో ప్రజల మాట వినడం అంటే కేవలం వారితో మాట్లాడటం కాదని, వారి సమస్యలు, ఆలోచనలు, భావాలను నిజంగా అర్థం చేసుకోవడమని తెలిపారు. ద్వేషం, కోపం, హింసతో కూడిన రాజకీయాలు ఎప్పటికీ విజయం సాధించలేవని, ప్రేమ, సత్యం, అహింస, కరుణ, పరస్పర గౌరవంతోనే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలమని అన్నారు. ఫాసిస్టు ధోరణులను ఎదుర్కోవడానికి ద్వేషం లేదా అణచివేత మార్గాలను అనుసరించాల్సిన అవసరం లేదని, తమ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల మద్దతుతోనే వాటిని ఓడించవచ్చనే విశ్వాసం వ్యక్తం చేశారు.

రాహుల్ నాయకత్వంలోనే మార్పు: రేవంత్

రాహుల్ నాయకత్వంలోనే మార్పును తీసుకురాగలుగుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలు సంపన్నుల కోసం పనిచేయడం మానుకుని, సామాన్యుల కోసం పనిచేయాలని అన్నారు. భారత్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం రెండు శక్తుల మధ్య పోరాటం జరుగుతోంది. ఒకటి ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటుంటే.. మరొకటి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని చూస్తోంది. మేం రాజ్యాంగం, చట్టబద్ధ పాలనకు కట్టుబడి ఉన్నాం. రెండో శక్తి రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి ప్రజలపై నియంతృత్వాన్ని రుద్దాలని చూస్తోంది. ప్రతి పౌరుడికీ ఓటు హక్కు ఉండాలని మేం కోరుకుంటున్నాం. నచ్చిన కొన్ని వర్గాలకే ఓటు హక్కు కల్పించాలని వారు చూస్తున్నారు. మేం పర్యావరణాన్ని కాపాడాలనుకుంటుంటే.. పర్యావరణాన్ని నాశనం చేయాలని వారు చూస్తున్నారు. పేదలు, మహిళలు, మైనారిటీలు, రైతులతో సహా ప్రతి ఒక్కరినీ రక్షించాలని మేం కోరుకుంటున్నాం. తమ సంపన్న మిత్రులను మాత్రమే కాపాడుకోవాలని వాళ్లు చూస్తున్నారు. అందరికీ సమాన అవకాశాలు ఉండాలని మేం కోరుతున్నాం. కొద్దిమంది చేతుల్లోనే అధికారం కేంద్రీకృతం కావాలని వారు చూస్తున్నారు. చర్చలు, సంప్రదింపులను మేం కోరుకుంటున్నాం. ఒకే వ్యక్తి నుంచి ఆదేశాలు రావాలని వారు కోరుకుంటున్నారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని చూస్తున్న శక్తులు.. ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్న మమ్మల్ని ఆపగలమని అనుకుంటే అది వారి భ్రమే. ఒక గొప్ప లక్ష్యం కోసం పోరాడుతున్నంత కాలం ప్రపంచంలోని ఏ శక్తి మమ్మల్ని ఆపలేదు" అని తేల్చి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అందరం ఒకే రకమైన సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో అందరమూ కలిసి పోరాడదామని భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ప్రతినిధులకు పిలుపునిచ్చారు. కలిసికట్టుగా పోరాడితేనే విజయం సాధిస్తామని, దేశంలో ఈ పోరాటానికి రాహుల్ గాంధీ నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. ప్రతి పౌరునికీ ఓటు హక్కు కల్పించడానికి, దళితులు, మైనారిటీలు, ఓబీసీలకు సామాజిక న్యాయం కల్పించడానికి ఆయన పోరాటం చేస్తున్నారని, ఈ పోరాటంలో రాహుల్ గాంధీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

గిగ్ వర్కర్లకు ఆరోగ్యభీమా అమలు

వారిని గౌరవించడమే కాంగ్రెస్ విధానం

గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా, 10లక్షల ఆరోగ్య బీమా అమలు చేసేలా చట్టం

ప్రతి డెలివరీ చార్జీలో 1శాతం.. వారి భవిష్యత్తు కోసం

'గిగ్ వర్కర్ల చట్టం' ప్రారంభోత్సవంలో రాహుల్ గాంధీ కుటుంబం మాటిస్తే.. అది చట్టంతో సమానం

కార్మికులకు అధికారిక గుర్తింపు కార్డులు: రేవంత్

గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్, రేవంత్ బైక్ ర్యాలీ

ప్రజా దీవెన, హైదరాబాద్ : గిగ్ వర్కర్లు దేశానికి అసలైన పునాదులని, వారిని కార్మికులుగా కాకుండా భాగస్వాములుగా గౌరవించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ గిగ్ వర్కర్లను కలిసినప్పుడు వారి కష్టాలను స్వయంగా విన్నానని, అన్ని రకాలుగా భద్రత కల్పిస్తామని ఆ రోజే వారికి మాట ఇచ్చానని గుర్తు చేశారు. నాడు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని జయభేరి గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన 'తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకం' ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌తోపాటు ఇతర నగరాల్లోనూ గిగ్ వర్కర్ల కోసం వై-ఫై సౌకర్యంతో కూడిన విశ్రాంతి కేంద్రాలను ప్రభుత్వం నిర్మించనుందని చెప్పారు. అక్కడ వాహనాన్ని పార్కింగ్ చేసుకుని, విశ్రాంతి తీసుకోవచ్చన్నారు. ప్రతి గిగ్ వర్కర్‌కు రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా అందించడానికి ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తోందని వెల్లడించారు. గిగ్ వర్కర్లకూ వారికీ సామాజిక భద్రత ఉండాలని, వారి భవిష్యత్తు కోసం డబ్బు ఆదా కావాలని పేర్కొన్నారు. అందుకే వారు పూర్తి చేసే ప్రతి డెలివరీ, ప్రతి రైడ్ చార్జీలో 1శాతం మొత్తాన్ని వారి భవిష్యత్తు భద్రతకు వినియోగిస్తామని, సదరు మొత్తాన్ని ఆయా కంపెనీలు గిగ్ వర్కర్స్ బోర్డులో జమ చేస్తాయని తెలిపారు. బోర్డు ద్వారా ఆ సొమ్ము నేరుగా గిగ్ వర్కర్ల బ్యాంక్ ఖాతాలకు చేరుతుందన్నారు. కొత్త చట్టం ప్రకారం వారు చేసే పని, పూర్తి చేసే రైడ్లు, డెలివరీలు, ప్రతి రైడ్ లేదా లావాదేవీకి ఎంత డబ్బు చెల్లిస్తున్నారనే పూర్తి సమాచారం వారికి అందుబాటులోకి రానుందని వివరించారు. కార్మికులను కేవలం సేవకులు, బానిసలుగా అణచివేయాలనేది బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమైతే.. కార్మికులకు భద్రత కల్పించి భాగస్వాములుగా మార్చడమే కాంగ్రెస్ భావజాలమని స్పష్టం చేశారు. గిగ్ వర్కర్ల కష్ట ఫలితం అంబానీ-అదానీలకు దక్కాలని, ఉబర్..ఓలా యాజమాన్యాలకు అందాలని ప్రదాని మోదీ భావిస్తున్నారని ఆరోపించారు. వారికి భద్రత, రక్షణ కల్పించాలని తాము భావిస్తున్నామన్నారు. గిగ్ వర్కర్లు భయపడాల్సిన పని లేదని, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డితోపాటు తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. గిగ్ వర్కర్ల కుటుంబాల్లోని పిల్లల విద్య బాధ్యతను తీసుకోవడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

రాహుల్ ఇచ్చిన హామీని నెరవేర్చాం

"గాంధీ కుటుంబం మాట ఇస్తే.. సువర్ణ అక్షరాలతో లిఖించిన చట్టంతో సమానం.. కొత్త చట్టం ద్వారా గతంలో గిగ్‌వర్కర్లకు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నెరవేర్చాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2023లో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4000 కిలో మీటర్ల పాదయాత్ర చేపట్టిన రాహుల్ గాంధీ.. పేదలు, కార్మికుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారని గుర్తు చేశారు. నాడు హైదరాబాద్‌కు వచ్చిన సమయంలో గిగ్ వర్కర్ల సమస్యలపై స్పందించిన రాహుల్‌గాంధీ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రత్యేక చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నెహ్రూ జన్మదినం సందర్భంగా రాహుల్ గాంధీ చేతుల మీదుగానే కొత్త చట్టాన్ని అమలులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.

ఆన్‌లైన్ డెలివరీలు, క్యాబ్, ఆటో సర్వీసులు అందిస్తున్న గిగ్ వర్కర్లకు ప్రభుత్వం తరఫున రూ.5లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచి కార్మికుల కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించామన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం, వారి హక్కులను కాపాడేందుకు ప్రత్యేకంగా గిగ్ వర్కర్స్ బోర్డును ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. అర్హులైన ప్రతి కార్మికుడికి అధికారిక గుర్తింపు కార్డులు అందజేస్తామని వెల్లడించారు. 'రాష్ట్రంలో ఏ కార్మికుడూ అభద్రతాభావంతో బతకాల్సిన అవసరం లేదు. మీ చెమట విలువను గుర్తిస్తూ ఈ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది' అని భరోసా కల్పించారు. గిగ్ వర్కర్ల తరఫున రాహుల్‌గాంధీకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గిగ్ వర్కర్ల సంక్షేమ పథకం అమలు పాలసీ బుక్‌ను ఆవిష్కరించిన రాహుల్, సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

గిగ్ స్టాప్‌లను ప్రారంభించిన రాహుల్

గిగ్ వర్కర్ల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి కేంద్రాలను (గిగ్ స్టాప్‌లను) సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రాహుల్ గాంధీ ప్రారంభించారు. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బస్సులో రెస్ట్ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో తిరిగే గిగ్ వర్కర్లు విశ్రాంతి తీసుకునేలా ఈ బస్సును రూపొందించారు. అలాగే, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సౌజన్యంతో తొలుత పటాన్‌చెరు, తెల్లాపూర్, చందానగర్, భారతీనగర్, కొండాపూర్ ప్రాంతాల్లో గిగ్ స్టాప్‌లను అందుబాటులోకి తెచ్చారు. గిగ్ వర్కర్లు ఎవరైనా సరే అందులో కూర్చుని తినవచ్చు. సేద తీరొచ్చు. కాలకృత్యాలను తీర్చుకోవచ్చు. ఈ రంగంలో పని చేస్తున్న దివ్యాంగ గిగ్ వర్కర్లకు ఈ గిగ్‌స్టాపలు ఎంతగానో దోహదపడనున్నాయి.

గిగ్ వర్కర్లతో రాహుల్ బైక్ ర్యాలీ

గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత హైటెక్ సిటీలోని శిల్పారామం ముందు ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో కలిసి నివాళులర్పించారు. అనంతరం ర్యాపిడో బైకర్ లలిత స్కూటీపై రాహుల్ గాంధీ, మరో బైక్‌పై సీఎం రేవంత్ ప్రయాణించారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. శిల్పారామం నుంచి జయభేరి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభ వరకు ర్యాలీ సాగింది.

మేకెదాటు డ్యామ్‌పై కాంగ్రెస్‌లో విభేదాలు!

కర్ణాటక విజ్ఞప్తిపై తమిళనాడు అభ్యంతరం

డీకే శివకుమార్ వినతిపై మాణిక్కం ఠాగూర్ ఆగ్రహం

న్యూఢిల్లీ: కావేరీ నదిపై కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన మేకెదాటు డ్యామ్ నిర్మాణం కాంగ్రెస్ పార్టీలోనే రాజకీయ విభేదాలకు కారణమైంది. ఈ ప్రాజెక్టుకు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గట్టిగా మద్దతు పలుకుతుండగా, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు మాణిక్కం ఠాగూర్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో రెండు రాష్ట్రాల్లో రాజకీయంగా ప్రాధాన్యం కలిగిన కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు వెలుగులోకి వచ్చాయి. రెండు రోజుల క్రితం బెంగళూరు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో డీకే శివకుమార్ మేకెదాటు ప్రాజెక్టు అంశాన్ని ప్రస్తావించారు. కర్ణాటకలో ఈ డ్యామ్ నిర్మాణాన్ని ఎవరూ అడ్డుకోలేరని పేర్కొంటూ, ప్రాజెక్టుకు అవసరమైన చట్టపరమైన, కేంద్ర ప్రభుత్వ అనుమతులను త్వరగా మంజూరు చేయాలని ప్రధానిని కోరారు. ఈ ప్రాజెక్టు కర్ణాటక హక్కులకు సంబంధించినదని, దీనివల్ల తమిళనాడుకు కేటాయించిన కావేరీ జలాల వాటాకు ఎలాంటి నష్టం జరగదని స్పష్టం చేశారు. డీకే శివకుమార్ వ్యాఖ్యలపై తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు మాణిక్కం ఠాగూర్ తీవ్రంగా స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పును, కావేరీ జల వివాదాల ట్రిబ్యునల్ తుది అవార్డును కర్ణాటక ప్రభుత్వం ఉల్లంఘించేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. తమిళనాడు దిగువ పరివాహక రాష్ట్రం కావడంతో ఆ రాష్ట్ర ప్రయోజనాలను ప్రభావితం చేసే ఏ ప్రాజెక్టునైనా కర్ణాటక ఏకపక్షంగా చేపట్టడానికి వీల్లేదని అన్నారు. తమిళనాడు సమ్మతి లేకుండా మేకెదాటు ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు అమలైతే కావేరీ డెల్టా ప్రాంతంలోని రైతుల జీవనోపాధికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టును అడ్డుకునేందుకు న్యాయపరమైన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌ను కోరారు.

డీకే శివకుమార్ కౌంటర్

తమిళనాడు కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాగూర్ విమర్శలపై డీకే శివకుమార్ స్పందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వాస్తవాలు ఆయనకు తెలియవని అన్నారు. తమిళనాడు కాంగ్రెస్ నేతలు ప్రతినిధి బృందంతో కర్ణాటకకు వస్తే మేకెదాటు ప్రాజెక్టు ప్రాంతానికి తీసుకెళ్లి, దాని ప్రయోజనాలను వివరిస్తానని తెలిపారు. తమ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడం ప్రతి నాయకుడి బాధ్యతేనని, అయితే వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. 2018లో సుప్రీంకోర్టు కావేరీ జలాల పంపిణీపై ఇచ్చిన తీర్పు ప్రకారం తమిళనాడుకు 177.25 టీఎంసీల నీటిని కేటాయించారు. కర్ణాటకకు 284.75 టీఎంసీల వాటా లభించింది. అయితే కర్ణాటక నుంచి తమకు రావాల్సిన నీరు సకాలంలో విడుదల కావడం లేదని తమిళనాడు తరచూ ఆరోపిస్తోంది. ఒకే జాతీయ పార్టీకి చెందిన నేతలు రెండు రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో పరస్పర విరుద్ధ వైఖరి ప్రదర్శిస్తుండటంతో మేకెదాటు ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.

సీఎం విజయ్‌కు స్టాలిన్ లేఖ

మేకెదాటు అంశంపై కర్ణాటక ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఎంకే స్టాలిన్ స్పందించారు. కావేరీ సమస్య తమిళనాడు ప్రజల జీవన్మరణ సమస్య అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా మౌనం వీడి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్‌కు స్టాలిన్ లేఖ రాశారు.

డ్రైవర్‌కు గుండెపోటు వచ్చిందా?

కజిరంగా ప్రమాదంపై అనుమానాలు.. సమగ్ర విచారణకు సీఎం ఆదేశం

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఎం హిమంత బిశ్వశర్మ

గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ కోణాల్లో దర్యాప్తు

డ్రైవర్‌కు ప్రత్యేక పోస్టుమార్టం నిర్వహించాలని నిర్ణయం

మృతుల కుటుంబాలకు రూ.9 లక్షల చొప్పున పరిహారం



గౌహతి: అసోంలోని కజిరంగా జాతీయ పార్కు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి డ్రైవర్ అనారోగ్యమే కారణమా? ప్రయాణిస్తున్న సమయంలో అతడికి గుండెపోటు వచ్చిందా? అనే కోణంలో ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 26 మంది మరణించగా, మరో 16 మంది గాయపడ్డారు. ప్రమాదానికి గల అసలు కారణాలను గుర్తించేందుకు సమగ్ర దర్యాప్తు చేయాలని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ అధికారులను ఆదేశించారు. గోలాఘాట్ జిల్లాలోని రంగాజన్ ప్రాంతంలో జాతీయ రహదారి-715పై శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న ఫోర్స్ ట్రావెలర్ మినీ బస్సు ఎదురుగా వస్తున్న కంటైనర్ ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం తీవ్రంగా దెబ్బతింది. పలువురు విద్యార్థులు సహా 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 35 నుంచి 40 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ప్రమాద స్థలాన్ని శనివారం పరిశీలించిన ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కీలక విషయాలు వెల్లడించారు. ట్రక్కులోని డాష్‌క్యామ్‌లో నమోదైన దృశ్యాలను పరిశీలించామని, రహదారి ఖాళీగా ఉన్నప్పటికీ ట్రావెలర్ ఒక్కసారిగా దిశ మార్చుకుని ట్రక్కు వైపు దూసుకెళ్లినట్లు కనిపించిందని తెలిపారు. డ్రైవర్‌కు గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ లేదా రక్తంలో చక్కెర స్థాయిలు ఆకస్మాత్తుగా పడిపోవడం వంటి వైద్యపరమైన సమస్యలు తలెత్తి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటనేది విచారణ తర్వాతే తెలుస్తుందని స్పష్టం చేశారు. కాగా, మరణించిన ఒక్కొక్కరి కుటుంబానికి రూ.9 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు సీఎం ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని, ప్రత్యేక వైద్య బృందాలను ఆసుపత్రులకు పంపించాలని అధికారులను ఆదేశించారు. కజిరంగా ప్రమాదం నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

డ్రైవర్‌కు ప్రత్యేక పోస్టుమార్టం

డ్రైవర్ మరణానికి ముందు అతడికి ఏదైనా వైద్యపరమైన సమస్య తలెత్తిందా అనే విషయాన్ని గుర్తించేందుకు ప్రత్యేకంగా పోస్టుమార్టం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గుండెపోటు, స్ట్రోక్, మధుమేహం కారణంగా రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోవడం వంటి అంశాలను నిపుణులు పరిశీలించనున్నారు. అలాగే డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడా? వాహనంలోని స్టీరింగ్ వ్యవస్థలో సాంకేతిక లోపం ఏమైనా తలెత్తిందా? అనే కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణకు కాంగ్రెస్ ఓ చీడపీడ

అబద్ధాలను మించిన 'అభయహస్తం'

తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం అంతులేనిది

హామీలన్నీ బూటకం..అన్నివర్గాలకు తీవ్ర మోసం

420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలపై

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జవాబు చెప్పాలి

బీసీలకు రూ.లక్ష కోట్ల బడ్జెట్ హామీ ఏడబోయింది?

మూడేండ్లలో ఖర్చు చేసింది రూ.5 వేల కోట్లలోపే

ఎస్సీ, ఎస్టీలకు 31 శాతం కాంట్రాక్టులు, బీసీలకు

42 శాతం వాటా హామీలు అమలుకు నోచుకోలేదు

విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఏదీ?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు



ప్రజా దీవెన, హైదరాబాద్ : తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం అంతులేనిదని, ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. 'అభయ హస్తం'లో పేరొన్న 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీయే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ రాష్ట్ర ఖజానా ఖర్చుతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలపై కూడా సమాధానం చెప్పాలని శనివారం ఎక్స్ వేదికగా నిలదీశారు. 'అబద్ధాలు.. పచ్చి అబద్ధాలు.. వీటన్నింటికీ మించి కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో అభయహస్తం' అంటూ మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ వివిధ వర్గాలకు భారీ హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును విస్మరించిందని విమర్శించారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, యువత, విద్యార్థులు, మైనారిటీలకు ఇచ్చిన హామీల అమల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని పేరొన్నారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన మూడేండ్లలో బీసీల కోసం కేటాయించిన నిధులు రూ.5 వేల కోట్లలోపే ఉన్నాయని విమర్శించారు. విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పిస్తామని ప్రకటించినా అమల్లో మాత్రం సున్నా పురోగతి ఉన్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలూ బుట్టదాఖలు

పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించేలా 'అంబేదర్ అభయ హస్తం' పథకాన్ని తీసుకొస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ పథకం అమలుకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 31 శాతం వాటా కల్పిస్తామని ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. యూత్ డిక్లరేషన్‌లో భాగంగా అధికారంలోకి వచ్చిన 365 రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ప్రకటించిన 'రాజీవ్ యువ వికాసం' పథకం కూడా అమల్లో విఫలమైందని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాల హామీకి బదులుగా కేవలం 10 వేల ఉద్యోగాలే ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

విద్యా భరోసా కార్డు ఏది?

విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.5 లక్షల విలువైన 'విద్యా భరోసా కార్డు' అందిస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ హామీ కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆచరణలో మాత్రం వారిని నిరాశకు గురిచేసిందని మండిపడ్డారు. మైనారిటీల సంక్షేమం కోసం ఏటా రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిందని పేరొన్నారు. కానీ, కేటాయింపులు రూ.వెయ్యి కోట్లలోపే ఉన్నాయని వివరించారు.

కాంగ్రెస్ ద్రోహానికి అంతులేదు

బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్, 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక ఆర్థిక పథకం, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో వాటా, యువతకు రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా కార్డు, మైనారిటీలకు భారీ బడ్జెట్.. ఇలా అన్ని వర్గాలకు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చిందని కేటీఆర్ పేరొన్నారు. వాటిలో కీలకమైన హామీలు ఇప్పటికీ నెరవేరలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను, ముఖ్యంగా యువత, బడుగు బలహీన వర్గాలను వంచించిందని విమర్శించారు.

మోదీని నిలదీస్తరా? మౌనంగా తిరిగొస్తరా?

సమ్మక సారలమ్మ డీపీఆర్‌ను వెనకి పంపడం అన్యాయం: హరీశ్‌రావు

968 టీఎంసీల హకుపై ప్రధాని నుంచి హామీ తేవాలి

ఇచ్చంపల్లి కాదని పోలవరం నుంచి ప్రాజెక్ట్ చేపడితే సహించం

తెలంగాణ నీటి హకుల కోసం బీఆర్ఎస్ మరో ప్రజా ఉద్యమం

రేవంత్, ఉత్తమ్ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో హరీశ్‌రావు ధ్వజం



ప్రజా దీవెన, హైదరాబాద్ : మరోసారి ఢిల్లీకి వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలంగాణ నీటి ప్రయోజనాలపై ప్రధాని మోదీని నిలదీస్తారా? లేక తలవంచి మౌనంగా తిరిగి వస్తారా? అని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. నీళ్ల విషయంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం, కేంద్ర ప్రభుత్వ వివక్ష వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతున్నదని ఆరోపించారు. రాష్ట్రానికి చట్టబద్ధంగా దకాల్సిన 968 టీఎంసీల గోదావరి జలాల వినియోగానికి సంబంధించిన అన్ని ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు సాధిస్తామని ప్రధాని వద్ద స్పష్టమైన హామీ తీసుకోవాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 47 టీఎంసీల జలాల హైడ్రాలజీ క్లియరెన్స్ ఇప్పటికే పూర్తయిన సమ్మక-సారలమ్మ ప్రాజెక్ట్ డీపీఆర్‌ను సీడబ్ల్యూ కొత్త మార్గదర్శకాల పేరుతో వెనకి పంపడం దారుణమని విమర్శించారు. ప్రాజెక్టుకు టీఏసీ అనుమతి మాత్రమే రావాల్సి ఉన్నదని, అలాంటి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేని అసమర్థత ఈ ప్రభుత్వానిదేనని మండిపడ్డారు. కేంద్రం వద్ద తెలంగాణ వాదనను బలంగా వినిపించే చిత్తశుద్ధి రేవంత్ ప్రభుత్వానికి లేకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోవైపు ఏపీ సీఎం చంద్రబాబు ఆరు నెలలుగా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు గురించి ప్రతి వేదికపై మాట్లాడుతున్నారని, తాజాగా సీఐఐ సదస్సులోనూ గోదావరి-కావేరి అనుసంధానాన్ని పోలవరం నుంచి బనకచర్ల వరకు చేపడుతామని ప్రకటించారని గుర్తుచేశారు.

నాడు బీఆర్ఎస్ స్పష్టమైన వైఖరి

తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాజీపడకుండా స్పష్టమైన వైఖరి తీసుకున్నదని హరీశ్‌రావు గుర్తుచేశారు. 968 టీఎంసీల గోదావరి జలాలపై రాష్ట్ర ప్రాజెక్టులన్నింటికీ ముందుగా కేంద్రం అనుమతులు ఇవ్వాలని, ఆ తర్వాతే నదుల అనుసంధాన ప్రాజెక్టును చేపట్టాలని డిమాండ్ చేసిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. తరలించే 148 టీఎంసీల్లో తెలంగాణకు 50 శాతం అంటే 75 టీఎంసీలు కేటాయించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టుబట్టిందని తెలిపారు. ఇచ్చంపల్లి నుంచే ఈ ప్రాజెక్టును చేపట్టాలని, తెలంగాణ భూభాగం మీదుగా అలైన్‌మెంట్ ఉండాలని స్పష్టం చేసిందని, తెలంగాణ డిమాండ్లను సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర టాస్‌ఫోర్స్ సైతం నాడు హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ అభ్యర్థన మేరకే ఎన్‌డబ్ల్యూడీఏ ఇచ్చంపల్లి నుంచి గ్రాండ్ అనికట్ వరకు డీపీఆర్ రూపొందించి సంబంధిత రాష్ట్రాలకు పంపిణీ చేసిందని తెలిపారు. కేవలం చంద్రబాబు ఒత్తిడికి తలొగ్గి ఆర్థికంగా వయబుల్ కాని ఏపీ మినహా ఇతర రాష్ట్రాలకు ప్రయోజనం లేని ప్రాజెక్టును తెరపైకి తెచ్చారని, పోలవరం నుంచి బనకచర్లకు ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మార్చారని ఆక్షేపించారు. జాతీయ ప్రాజెక్టును పకనపెట్టి ఏపీకి అనుకూలంగా మార్చే కుట్రను సహించబోమని, మన నీటి హకుల కోసం బీఆర్ఎస్ మరో ప్రజా ఉద్యమం చేపడుతుందని హరీశ్‌రావు హెచ్చరించారు.

సమస్యల పరిష్కారమే పార్టీల లక్ష్యం కావాలి

సిద్ధాంతాల కంటే రోజువారీ సమస్యల పరిష్కారమే ముఖ్యం

సమ్మిట్‌లో వివిధ దేశాల రాజకీయ ప్రముఖుల అభిప్రాయం

ప్రజా దీవెన, హైదరాబాద్ : ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపడమే రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం కావాలని పలు దేశాలకు చెందిన రాజకీయ ప్రముఖులు అభిప్రాయపడ్డారు. హెచ్‌ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్ 2026లో భాగంగా 'ఇన్నోవేటివ్ ఐడియాస్ ఫర్ ప్రోగ్రెసివ్స్' అనే అంశంపై శనివారం చర్చ జరిగింది. ఈ చర్చలో స్లోవేనియాలోని డీ-హబ్‌కు చెందిన నిక్కా కొవాచ్, అమెరికాలోని సెంటర్ ఫర్ అమెరికన్ ప్రోగ్రెస్‌కు చెందిన జోహాన్ హాసెల్, థాయ్‌లాండ్‌లోని పీపుల్స్ పార్టీ నాయకురాలు కుంతిదా రుంగ్రు ఎంగ్‌కియాట్, నార్వేజియన్ లేబర్ పార్టీ హెడ్ ఆఫ్ స్ట్రాటజీ ఓయ్‌విండ్ వెనెస్లాండ్, ఈక్వెడార్ కాంగ్రెస్ మహిళా సభ్యురాలు మారియా ఇవిగుయేజ్, భారత ప్రవీణ్ చక్రవర్తి పాల్గొన్నారు. గిగ్ వర్కర్ల హక్కులు, ఉద్యోగ భద్రతపై స్పష్టమైన విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సిద్ధాంతాల గురించి మాట్లాడటం కంటే ముందు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడమే రాజకీయ పార్టీల లక్ష్యంగా ఉండాలని ఓయ్‌విండ్ అన్నారు.

రాహుల్ త్వరలో ప్రధాని కాబోతున్నారు: మంత్రి కోమటిరెడ్డి

ప్రజా దీవెన, హైదరాబాద్ : రాహుల్ గాంధీ త్వరలోనే దేశానికి ప్రధాన మంత్రి కాబోతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్‌కు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ లాగా రాహుల్‌గాంధీ తండ్రి చాటు కొడుకు కాదన్నారు. దేశమే తన కుటుంబంగా రాహుల్ భావిస్తున్నారని, ఆయన గురించి మాట్లాడేముందు కేటీఆర్ ఆలోచించుకోవాలని హితవు పలికారు. మరోవైపు, తమ నేత రాహుల్‌గాంధీ 7సార్లు బహిరంగ చర్చలకు సవాల్ విసిరినా ప్రధాని మోదీ ఎందుకు స్పందించడం లేదని మంత్రి అన్నారు. మోదీ ఇకనైనా దాటవేత ధోరణిని విడిచి రాహుల్ సవాల్‌ను స్వీకరించాలన్నారు.

తెలంగాణకు రాయబారులుగా మారండి

భారత్ సమ్మిట్ ప్రతినిధులకు మంత్రి ఉత్తమ్ పిలుపు

ప్రజా దీవెన, హైదరాబాద్ : తెలంగాణలోని అభివృద్ధి, ఆవిష్కరణలు, భాగస్వామ్య అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయాలని సమ్మిట్‌లో పాల్గొన్న అంతర్జాతీయ ప్రతినిధులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. సమ్మిట్‌లో పాల్గొన్న ప్రతినిధులంతా తమ దేశాలకు తిరిగివెళ్లిన తర్వాత తెలంగాణకు రాయబారులుగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. భారత్ సమ్మిట్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అవకాశాలను ఇతరులకు వివరించి, పెట్టుబడులు, దీర్ఘకాలిక అంతర్జాతీయ భాగస్వామ్యాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. విభిన్న అనుభవాలు, అభిప్రాయాలు, దృక్పథాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ప్రజాస్వామ్యం, న్యాయం, పరస్పర సహకారంపై గంభీరమైన చర్చలకు భారత్ సమ్మిట్ అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. మారుతున్న ప్రపంచంలో భారతదేశ స్థానం, కృత్రిమ మేధ, న్యాయమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆవశ్యకత, యువత భవిష్యత్తు రాజకీయాలు, వాతావరణ మార్పులు, లింగ సమానత్వం వంటి కీలక అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. 'ఫార్జింగ్ ఏ న్యూ వరల్డ్' అనే ఇతివృత్తం ద్వారా ప్రపంచంలో చోటుచేసుకుంటున్న మార్పులను అర్థం చేసుకోవడంతో పాటు, వాటికి అనుగుణంగా భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన అవసరంపై చర్చించామన్నారు.

హసీనా భద్రతకు హామీ ఇవ్వాల్సిందే!

న్యాయమైన విచారణ.. అప్పీల్‌కు అవకాశం కల్పించాలి

మరణశిక్షపై అప్పీల్ చేసుకునే వెసులుబాటు ఇవ్వాలి

బంగ్లాదేశ్‌కు భారత్ రెండు షరతులు

హసీనా తిరుగు ప్రయాణానికి భద్రతా ఏర్పాట్లు కీలకం

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లే అంశంపై భారత్ కీలక ప్రతిపాదనలు చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆమె భద్రతకు, న్యాయపరమైన హక్కులకు హామీ లభించిన తర్వాతే బంగ్లాదేశ్‌కు పంపించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భారత్ భావిస్తున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. ఇందుకోసం ప్రధానంగా రెండు షరతులను బంగ్లాదేశ్ ప్రభుత్వం ముందు ఉంచినట్లు తెలుస్తోంది. షేక్ హసీనా తిరిగి స్వదేశానికి వెళ్లే ప్రయాణాన్ని బంగ్లాదేశ్ సైన్యం పర్యవేక్షించాలని భారత్ కోరుతున్నట్లు సమాచారం. 2024 ఆగస్టు 5న బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తడంతో ఆమె అక్కడి నుంచి సైనిక విమానంలో భారత్‌కు చేరుకున్నారు. ఇప్పుడు తిరిగి వెళ్లే సమయంలోనూ బంగ్లాదేశ్ సైన్యమే బాధ్యత తీసుకోవాలని భారత్ భావిస్తున్నట్లు మీడియా కథనం వెలువరించింది. ఇందుకోసం రెండు మార్గాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఢిల్లీకి సైనిక విమానాన్ని పంపించి ఆమెను తీసుకెళ్లడం లేదా భారత్–బంగ్లాదేశ్ సరిహద్దులో ఒక నిర్దిష్ట ప్రాంతంలో బంగ్లాదేశ్ సైన్యం ఆమెను స్వీకరించడం వంటి ప్రతిపాదనలు ఉన్నట్లు కథనం పేర్కొంది. రెండో షరతు న్యాయపరమైన అంశానికి సంబంధించినది. 2024 జూలై ఉద్యమ సమయంలో జరిగిన హింసాకాండకు సంబంధించి షేక్ హసీనాపై బంగ్లాదేశ్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో ఆమెకు మరణశిక్ష విధించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ తీర్పుపై అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించాలని, న్యాయమైన రీతిలో విచారణ జరగాలని భారత్ కోరుతున్నట్లు సమాచారం. అంతర్జాతీయ సమాజం, ప్రపంచ మీడియా పర్యవేక్షణలో న్యాయప్రక్రియ కొనసాగితేనే ఆమెకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయాన్ని భారత అధికారులు వ్యక్తం చేసినట్లు మీడియా కథనం వెల్లడించింది.

డిసెంబరులో తిరిగి వస్తానన్న హసీనా

2024 ఆగస్టు నుంచి భారత్‌లో ఉంటున్న షేక్ హసీనా డిసెంబరులో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లాలని భావిస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆమె స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. కొత్త పాస్‌పోర్టు, ప్రయాణ పత్రాల కోసం ఈ నెల 9న దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. భారత్‌కు వచ్చిన తర్వాత బంగ్లాదేశ్ ప్రభుత్వంతో ఆమెకు ఏర్పడిన తొలి అధికారిక సంబంధిత పరిణామంగా దీనిని పరిగణిస్తున్నారు. షేక్ హసీనా తిరుగు ప్రయాణానికి సంబంధించి భారత్ రెండు షరతులు విధించిందన్న వార్తలపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించేందుకు నిరాకరించారు.

ఫోన్ ట్యాపింగ్‌పై భిన్న స్వరాలు!

రాహుల్ ఆరోపణలతో ఏకీభవించని శామ్ పిట్రోడా

ప్రధాని మోదీ స్వయంగా ఫోన్లు ట్యాప్ చేయరని వ్యాఖ్య

నా ఫోన్ కూడా ట్యాప్ అవుతోంది.. ల్యాప్‌టాప్‌పైనా సైబర్ దాడులు

కాంగ్రెస్‌లోనే భిన్నాభిప్రాయాలు.. రాజకీయంగా చర్చనీయాంశం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే, ఈ ఆరోపణలకు భిన్నంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు శామ్ పిట్రోడా స్పందించారు. ప్రధాని మోదీ స్వయంగా ఫోన్లను ట్యాప్ చేస్తారని తాను భావించడం లేదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ స్వయంగా కంప్యూటర్ ముందు కూర్చొని ఫోన్లను ట్యాప్ చేసే వ్యక్తి కాదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలతో తాను ఏకీభవించడం లేదని పరోక్షంగా వెల్లడించారు. ఇటీవల ప్రధాని మోదీతో దీపావళి శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్న నేపథ్యంలో పిట్రోడా వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మరోవైపు, తన వ్యక్తిగత ఫోన్ కూడా ట్యాప్ అవుతోందని పిట్రోడా ఆరోపించారు. తన ల్యాప్‌టాప్‌పై సైబర్ దాడులు జరుగుతున్నాయని, బ్యాంకు ఖాతాలపై కూడా నిఘా కొనసాగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సాంకేతిక నిపుణులను సంప్రదించానని, తన ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలించిన నిపుణులు నిఘా ఉండే అవకాశం ఉందని హెచ్చరించినట్లు తెలిపారు. అయితే, తన ఫోన్‌ను ఎవరు ట్యాప్ చేస్తున్నారనే విషయం తనకు తెలియదని, దీని వెనుక ఎవరున్నారో చెప్పలేనని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు, శామ్ పిట్రోడా భిన్నమైన స్పందనతో కాంగ్రెస్‌లోనూ, రాజకీయ వర్గాల్లోనూ ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

యూపీలో ఎస్ఐఆర్ చిచ్చు!

ఓటర్ల జాబితాపై బీజేపీ, విపక్షాల మధ్య మాటల యుద్ధం

1.27 కోట్ల మంది హిందూ ఓటర్ల పేర్లు గల్లంతు: సీఎం యోగి

యోగి వ్యాఖ్యలు భయాందోళనలు సృష్టించే ప్రయత్నం: అఖిలేశ్

ఎస్ఐఆర్ ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలే: పవన్ ఖేరా

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వ్యవహారం రాజకీయ దుమారం రేపుతోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ అంశం బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరుకు కేంద్రబిందువుగా మారుతోంది. రాష్ట్రంలోని ఓటర్ల జాబితా నుంచి దాదాపు 1.27 కోట్ల మంది హిందువుల పేర్లు తొలగిపోయాయని సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. యోగి వ్యాఖ్యలు సమాజంలో భయాందోళనలు సృష్టించేందుకు చేస్తున్న ప్రయత్నమని విమర్శించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో హిందూ ఓటర్ల పేర్లు పెద్ద సంఖ్యలో గల్లంతయ్యాయని సీఎం యోగి పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఉన్నవారి పేర్లు ఎన్నికల సంఘం రూపొందించిన జాబితాలో ఎలా మాయమయ్యాయని ప్రశ్నించారు. ముఖ్యంగా మహిళలు, యువత, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లు తొలగిపోయాయని ఆరోపించారు. అదే సమయంలో ముస్లిం ఓటర్ల సంఖ్య 1.65 శాతం పెరిగిందని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని ఎన్నికల సంఘానికి తమ ప్రభుత్వం వినతిపత్రం సమర్పించినట్లు వెల్లడించారు. మరణించిన దాదాపు 46 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించడంపై తమకు అభ్యంతరం లేదని, అయితే అర్హులైన ఓటర్ల పేర్లు మాత్రం జాబితాలో ఉండాలని స్పష్టం చేశారు. 2027 అసెంబ్లీ ఎన్నికలకు ముందు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి 2.04 కోట్లకు పైగా పేర్లు తొలగించారు. అదే సమయంలో 84 లక్షలకు పైగా కొత్త ఓటర్ల పేర్లను చేర్చారు. తుది ఓటర్ల సంఖ్య 13.39 కోట్లకు చేరినట్లు ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడించాయి. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆరోపణలపై అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. 1.27 కోట్ల మంది హిందూ ఓటర్ల పేర్లు తొలగిపోయాయని ముఖ్యమంత్రి కచ్చితమైన సంఖ్యతో ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. ఈ సమాచారం ఎన్నికల సంఘం ముఖ్యమంత్రికి ఎలా అందించిందో అర్థం కావడం లేదన్నారు. సమాజంలో భయాందోళనలు సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందేందుకు ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల నుంచి వ్యక్తులను తీసుకొచ్చి ఉత్తరప్రదేశ్ ఓటర్లుగా నమోదు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ పేరుతో దేశవ్యాప్తంగా అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ తమ పార్టీ గత కొన్ని నెలలుగా ఆందోళన వ్యక్తం చేస్తోందని తెలిపారు.

అగ్రరాజ్య అధినేతల అలాయ్ బలాయ్

ఒకే వేదికపై ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్

వచ్చే వారం భేటీ.. ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించే సమావేశమా?

అణ్వాయుధ నియంత్రణపై ట్రంప్ ప్రతిపాదన..

ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్ వ్యూహం

ప్రపంచాధిపత్య పోటీలో చైనా కీలక పాత్ర

ఇరాన్ యుద్ధంపైనా చర్చలు?



న్యూఢిల్లీ: ప్రపంచ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరమైన దౌత్య పరిణామానికి రంగం సిద్ధమవుతోంది. ప్రపంచంలోని మూడు అగ్రరాజ్యాల అధినేతలు ఒకే వేదికపై సమావేశం కానున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే వారం చైనాలోని షెన్‌జెన్‌లో త్రైపాక్షిక చర్చలు జరపనున్నారు. నవంబర్ 19న ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార సంస్థ (ఏపీఈసీ) సదస్సు సందర్భంగా ఈ భేటీ జరగనున్నట్లు వైట్‌హౌస్ ధ్రువీకరించింది. ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధ సామర్థ్యం కలిగిన మూడు దేశాల నేతలు ఒకేసారి సమావేశం కావడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశం కేవలం ముగ్గురు నేతల కలయిక మాత్రమే కాదు. మారుతున్న ప్రపంచ రాజకీయ సమీకరణాలు, అణ్వాయుధ పోటీ, ఆర్థిక ఆధిపత్యం, ప్రాంతీయ యుద్ధాలు, అంతర్జాతీయ భద్రత వంటి అనేక అంశాలకు సంబంధించి కీలక సంకేతాలను ఇచ్చే అవకాశం ఉంది.

అణ్వాయుధ నియంత్రణే ట్రంప్ ప్రధాన అజెండా

ఈ సమావేశంలో అణ్వాయుధాల నియంత్రణ, వాటి విస్తరణను అరికట్టడం ప్రధాన చర్చనీయాంశంగా ఉండనుంది. ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలు కలిగిన అమెరికా, రష్యాలతో పాటు చైనాను కూడా అణ్వాయుధ నియంత్రణ చర్చల్లో భాగస్వామిని చేయాలని ట్రంప్ భావిస్తున్నారు. అమెరికా, రష్యా మధ్య ఉన్న చివరి ప్రధాన అణ్వాయుధ నియంత్రణ ఒప్పందం న్యూ స్టార్ట్ 2026 ఫిబ్రవరిలో గడువు ముగిసింది. దీంతో ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగిన అణ్వాయుధ పరిమితుల వ్యవస్థలో కీలకమైన రక్షణ కవచం తొలగిపోయింది. ఈ నేపథ్యంలో కొత్త ఒప్పందం అవసరమని అమెరికా భావిస్తోంది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అంచనాల ప్రకారం అమెరికా, రష్యా వద్ద ఐదు వేలకుపైగా అణ్వాయుధాలు ఉండగా, చైనా వద్ద 600కు పైగా ఉన్నట్లు అంచనాలున్నాయి. చైనా అణ్వాయుధ సామర్థ్యాన్ని వేగంగా పెంచుకుంటున్న నేపథ్యంలో దానిని కూడా నియంత్రణ చర్చల్లోకి తీసుకురావాలని వాషింగ్టన్ ప్రయత్నిస్తోంది. అయితే చైనా ఇందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. అమెరికా, రష్యాల అణ్వాయుధ నిల్వలతో పోలిస్తే తమ నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని, సమాన స్థాయిలో లేని దేశాల మధ్య ఒకే విధమైన పరిమితులు విధించడం సమంజసం కాదని బీజింగ్ గతంలో స్పష్టం చేసింది.

ఫొటో సెషనా.. చారిత్రాత్మక మలుపా?

ఈ సమావేశం నుంచి తక్షణమే అణ్వాయుధ నియంత్రణ ఒప్పందం వెలువడుతుందని అమెరికా కూడా ఆశించడం లేదు. ఇది భవిష్యత్తులో చర్చలకు ప్రారంభ బిందువుగా మాత్రమే ఉంటుందని వైట్‌హౌస్ వర్గాలు సంకేతాలిచ్చాయి. ముగ్గురు నేతల మధ్య వ్యక్తిగత సంబంధాలు, దేశాల వ్యూహాత్మక ప్రయోజనాలు, పరస్పర అనుమానాలు ఈ చర్చల ఫలితాన్ని ప్రభావితం చేయనున్నాయి. ఒకవైపు ప్రపంచంలో అణ్వాయుధ పోటీని తగ్గించాల్సిన అవసరం ఉంది. మరోవైపు ఉక్రెయిన్, ఇరాన్ వంటి యుద్ధాలు అంతర్జాతీయ శాంతికి సవాలుగా మారాయి. అమెరికా–చైనా వాణిజ్య, సాంకేతిక పోటీ కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో షెన్‌జెన్‌లో జరిగే భేటీ ప్రపంచ దౌత్య చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచే అవకాశం ఉంది. అయితే ఇది కొత్త ప్రపంచ శాంతికి పునాది వేస్తుందా? లేక మూడు అగ్రరాజ్యాల ఆధిపత్య పోరుకు మరో వేదికగా మిగిలిపోతుందా? అన్నది వేచి చూడాల్సిందే.

యాల్టా సమావేశంతో పోలికలు.. కొత్త ప్రపంచ క్రమానికి సంకేతమా?

1945లో రెండో ప్రపంచ యుద్ధం ముగింపు దశలో అమెరికా, బ్రిటన్, సోవియట్ యూనియన్ నేతలు యాల్టాలో సమావేశమై యుద్ధానంతర ప్రపంచ వ్యవస్థపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పుడు ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్ భేటీ నేపథ్యంలో మరోసారి యాల్టా సమావేశం ప్రస్తావన అంతర్జాతీయంగా చర్చకు వస్తోంది. అయితే ప్రస్తుత సమావేశాన్ని అప్పటి యాల్టా సమావేశంతో నేరుగా పోల్చడం తొందరపాటు అవుతుంది. ఎందుకంటే నేటి ప్రపంచంలో ఐక్యరాజ్యసమితి, ఐరోపా సమాఖ్య, నాటో, ఇతర అంతర్జాతీయ సంస్థలు, ప్రాంతీయ శక్తులకు కూడా కీలక పాత్ర ఉంది. అమెరికా, చైనా, రష్యాలు మాత్రమే ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించే పరిస్థితి లేదు. చిన్న, మధ్యస్థ దేశాల సార్వభౌమాధికారాన్ని పక్కనపెట్టి తీసుకునే నిర్ణయాలు అంతర్జాతీయంగా ఆమోదం పొందడం కూడా సాధ్యం కాదు.

ఉక్రెయిన్ యుద్ధం.. పుతిన్‌కు దౌత్య అవకాశమా?

2022లో ప్రారంభమైన రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఇప్పటికీ అంతర్జాతీయ రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. ఈ యుద్ధానికి ముగింపు పలికే దిశగా అమెరికా ప్రయత్నాలు కొనసాగిస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ మాత్రం తన దేశ ప్రయోజనాలు, ప్రాదేశిక డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గేందుకు సిద్ధంగా లేరు. ట్రంప్‌తో సమావేశం ద్వారా రష్యాపై కొనసాగుతున్న అంతర్జాతీయ ఒంటరితనాన్ని తగ్గించుకోవడంతో పాటు, అమెరికాతో సంబంధాలను మెరుగుపరుచుకోవాలని పుతిన్ భావించే అవకాశం ఉంది. అయితే ఈ త్రైపాక్షిక సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధం అధికారిక చర్చనీయాంశంగా ఉండదని అమెరికా అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్ అంశంపై అమెరికా, రష్యాల మధ్య ప్రత్యేక దౌత్య చర్చలు కొనసాగుతున్నాయని, ఆ ప్రక్రియలో చైనా భాగస్వామి కాదని స్పష్టం చేశారు. మరోవైపు చర్చల అంశంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ దేశ భవిష్యత్తుపై తమ ప్రమేయం లేకుండా అగ్రరాజ్యాలు నిర్ణయాలు తీసుకునే పరిస్థితి రాకూడదని ఉక్రెయిన్ భావిస్తోంది.

చైనా వ్యూహం.. రెండు అగ్రరాజ్యాల మధ్య సమతుల్యం

ఈ సమావేశంలో షీ జిన్‌పింగ్ పాత్ర అత్యంత కీలకం. అమెరికాతో వాణిజ్య, సాంకేతిక పోటీ కొనసాగుతుండగా, రష్యాతో చైనా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకుంటోంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆర్థిక ఆంక్షలు విధించాయి. ఈ పరిస్థితుల్లో చైనా రష్యాకు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా మారింది. ఇంధనం, సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం పెరిగింది. అమెరికాతో సంబంధాలను పూర్తిగా దెబ్బతినకుండా చూసుకుంటూ, రష్యాతో స్నేహాన్ని కొనసాగించడం చైనాకు కీలకమైన వ్యూహాత్మక సవాలు. ఈ భేటీ ద్వారా అంతర్జాతీయ దౌత్యంలో తన ప్రాధాన్యాన్ని చాటుకోవాలని జిన్‌పింగ్ భావించే అవకాశం ఉంది.

ఇరాన్ యుద్ధం కూడా చర్చల్లోకి

ఈ సమావేశంలో అణ్వాయుధ నియంత్రణతో పాటు ఇరాన్‌కు సంబంధించిన యుద్ధ పరిణామాలను కూడా ట్రంప్ ప్రస్తావించనున్నట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. ఇరాన్ విషయంలో అమెరికా, రష్యా, చైనాల మధ్య భిన్నమైన వ్యూహాత్మక ప్రయోజనాలు ఉన్నాయి. ఇరాన్‌తో రష్యా, చైనాలకు ఉన్న సంబంధాలు కూడా ఈ చర్చలకు ప్రాధాన్యం కల్పిస్తున్నాయి. అయితే ఈ అంశంలో ముగ్గురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చే అవకాశాలపై స్పష్టత లేదు.

హస్తినలో ఆందోళనల అనుమతులపై ఆంక్షలు

50 వేల మందికే అనుమతి..

సమయాలపైనా పరిమితులు

ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకే సభలు, నిరసనలు

10 రోజుల ముందుగానే పోలీసులకు దరఖాస్తు చేయాలి

మారణాయుధాలపై నిషేధం.. డ్రోన్లకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ముసాయిదా ఎస్ఓపీ సిద్ధం చేసిన ఢిల్లీ పోలీసులు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించే బహిరంగ సభలు, నిరసన కార్యక్రమాలపై ఢిల్లీ పోలీసులు కొత్త నిబంధనలు రూపొందిస్తున్నారు. ఈ మైదానంలో జరిగే కార్యక్రమాలకు గరిష్ఠంగా 50 వేల మందిని మాత్రమే అనుమతించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతించాలని ముసాయిదా ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)లో పేర్కొన్నారు. కొత్త ప్రతిపాదనల ప్రకారం సభలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు ముందుగా ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) నుంచి మైదానం అందుబాటులో ఉందనే ధ్రువీకరణ పొందాలి. అనంతరం పోలీసుల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. కార్యక్రమం నిర్వహించడానికి కనీసం 10 రోజుల ముందుగానే దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. సభలకు వచ్చే ప్రజల నిర్వహణ బాధ్యతలను నిర్వాహకులకే అప్పగించాలని పోలీసులు ప్రతిపాదించారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకోవడంతోపాటు వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. రహదారులు, ఫుట్‌పాత్‌లు, అత్యవసర సేవల వాహనాలు వెళ్లే మార్గాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలి. అలాగే సభలకు వచ్చే వారికి తాగునీరు, వైద్య సహాయం, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలి. కార్యక్రమం ముగిసిన తర్వాత చెత్తను తొలగించే బాధ్యత కూడా నిర్వాహకులదే.

ఆయుధాలు, డ్రోన్లపై ఆంక్షలు

సభలకు వచ్చే వారు తుపాకులు, కత్తులు, ఖడ్గాలు, ఈటెలు, తాళ్లు, పదునైన వస్తువులు వంటి నిషేధిత సామగ్రిని తీసుకురాకూడదనే నిబంధనను ప్రతిపాదించారు. మైదానం పరిసర ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేయాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి చేయనున్నారు.

హింసాత్మక చర్యలు, ఆస్తుల ధ్వంసం, ప్రజాశాంతికి భంగం కలిగించే కార్యకలాపాలపై కూడా ఆంక్షలు విధించనున్నారు. ఢిల్లీ పోలీసులు రూపొందించిన ఈ ముసాయిదా ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉంది. ఆమోదం కోసం దీనిని ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపించారు. ఇటీవల జంతర్‌మంతర్‌లో నిరసన కార్యక్రమాల నిర్వహణకు కేటాయించిన ప్రాంతాల జాబితా నుంచి తొలగించి, రాంలీలా మైదానం, బురారీ మైదానం, తూర్పు ఢిల్లీలోని సీబీడీ మైదానాలను ప్రత్యామ్నాయ వేదికలుగా గుర్తించిన నేపథ్యంలో ఈ ప్రతిపాదనలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

గాంధీజీ లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



నాంపల్లి ప్రజా దీవెన : మండల కేంద్రంలోని స్థానిక గాంధీజీ విద్యాసంస్థల్లో భారత తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నెహ్రూ చిత్రపటానికి ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, డైరెక్టర్ కర్నాటి నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. చిన్నారులు రంగురంగుల దుస్తులు ధరించి తమ ప్రతిభను చాటుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, వివిధ వినోద కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఉత్సాహం, వారి ప్రతిభతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలంటే జవహర్‌లాల్ నెహ్రూకు ఎంతో ప్రేమాభిమానాలు ఉండేవని, అందుకే ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, పట్టుదల, సేవాభావం అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలను అభినందించి, బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సరికొండ వెంకన్న, పాఠశాల ప్రిన్సిపల్స్ మద్ది వెంకటేశ్వర్లు, చిలుకూరి రామేశ్వరి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, గాదెపాక రవీందర్ విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు అందుబాటులోకి వైద్య సేవలు..!

మాదారం లో పల్లె దవాఖానా ప్రారంభం



శాలిగౌరారం : శాలిగౌరారం మండలం మాదారం గ్రామంలో గ్రామీణ పల్లె దవాఖానా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశాల మేరకు శాలిగౌరారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ తోటకూరి పరుశరాములు మండల వైద్యాధికారి డాక్టర్ వెంకన్న తో కలిసి పల్లె దవాఖానాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో తీసుక రావడానికి కీలక పాత్ర పోషిస్తాయన్నారు.పాక్స్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు తాళ్లూరి మురళి, మాజీ జడ్పీటీసీ నోముల వెంకన్న యాదవ్,మార్కెట్ డైరెక్టర్ రాజుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నోముల జనార్ధన్,హెల్త్ కమ్యూనిటీ అధికారి రాపోల్ రవి,గ్రామ కార్యదర్శి బండారి శివ, ఇటుకులపహాడు ఉపసర్పంచ్ సుల్తాన్ యల్లయ్య, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇందనూరు శ్రీను, వార్డు సభ్యులు మాదగోని సైదులు, వినీత నాగరాజు, దాసరి మానస, మామిడి రాజశేఖర్,హెల్త్ అసిస్టెంట్లు,ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు..

శ్రీ వెంకటేశ్వర విద్యా మందిర్ పాఠశాల లో..



కనగల్: మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర విద్యా మందిర్ హైస్కూల్లో బాలల దినోత్సవ కార్యక్రమం శనివారం ప్రధానోపాధ్యాయుడు బల్గూరి వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ నేటి బాలలే రేపటి సమాజ నిర్మాతలని, దేశ భవిష్యత్ కి పునాది వంటి వారాని బాల్య దశలోనే గ్రహణ సామర్థ్యం నేర్చుకునే స్వభావం అధికంగా ఉంటుందన్నారు మన పాఠశాలలోనే అవకాశాలను సద్వినియోగం పరుచుకొని స్వేచ్ఛపూరిత వాతావరణంలో విద్యాభ్యాసం గవించి ఉన్నంత స్థానంలో చేరాలని పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా ఆటపాటలు ప్రదర్శన లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అనంత లక్ష్మి, శివ, రవీందర్, వసంత ,సరిత ,చాందిని, మంజుల తదితరులు పాల్గొన్నారు

ప్రత్యామ్నాయ పంటలతోనే వ్యవసాయం లాభసాటి

నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్ కీలక వ్యాఖ్య
వాతావరణానికనుగుణంగా సాగు విధానాలు మార్చుకోవాలి



ప్రజా దీవెన, నల్లగొండ: మారు తున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భవి ష్యత్తులో నీటి కొరతను దృష్టిలో పెట్టుకొని రైతులు వ్యవసాయ సాగు విధానాల్లో మార్పులు చే సుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్ట ర్ బి. చంద్రశేఖర్ సూచించారు. సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపు చ్చుకుంటే వ్యవసాయాన్ని లాభ సాటిగా మార్చుకోవచ్చని పిలు పునిచ్చారు. రైతులకు ప్రభుత్వం తో పాటు జిల్లా యంత్రాంగం అ న్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.శనివారం నల్ల గొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి న మూడు రోజుల వ్యవసాయ ప్రదర్శన (అగ్రి షో)ను నగర మే యర్ బుర్రి చైతన్య శ్రీనివాసరె డ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించా రు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన 120 స్టాళ్లను సందర్శించి ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, నూతన సాగు పద్ధతులు, వివిధ వ్యవసా య ఉత్పత్తులను పరిశీలించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఎల్‌నినో ప్రభావంతో వా తావరణంలో అనూహ్య మార్పు లు చోటుచేసుకుంటున్నాయని, చలికాలంలోనూ వేసవిని తల పించేలా ఉష్ణోగ్రతలు పెరుగుతు న్నాయని తెలిపారు. రానున్న రో జుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశా లు ఉన్నందున తక్కువ నీటితో పండించే పంటలకు రైతులు ప్రా ధాన్యత ఇవ్వాలని సూచించా రు. నేల స్వభావం, నీటి వనరు లు, వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాతే పం టల సాగుపై నిర్ణయం తీసుకోవా లని స్పష్టం చేశారు.

14 వేల ఎకరాల్లో నూనెగింజల సాగు

జిల్లాలో ఇప్పటికే సుమారు 14 వేల ఎకరాల్లో నూనెగింజల పం టలు సాగు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఆయిల్‌పామ్, ఇ తర నూనెగింజల పంటలతో పా టు కూరగాయలు, పప్పుధాన్యా ల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వివిధ పథకాలు, స బ్సిడీలు అందిస్తోందన్నారు. రై తు భరోసా ద్వారా పెట్టుబడి సా యం, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూ క్ష్మ సేద్య పద్ధతులకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు వివరించారు.

సాగు నుంచి మార్కెటింగ్ వరకు రైతులే కీలకం

రైతులు పండించిన పంటలను ముడి సరుకుగా విక్రయించడా నికే పరిమితం కాకుండా వాటిని ప్రాసెసింగ్ చేసి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్కెట్‌లో విక్ర యించాలని కలెక్టర్ సూచించా రు. రైతులు సంఘాలుగా ఏర్పడి సమష్టి సాగు చేపడితే పెట్టుబడు లు తగ్గడంతో పాటు ఆదాయం పెంచుకునే అవకాశం ఉంటుంద న్నారు. రైతులు, మహిళా సం ఘాలు చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసిం గ్ యూనిట్లు ఏర్పాటు చేసుకు నేందుకు ముందుకు వస్తే జిల్లా యంత్రాంగం అవసరమైన సహ కారం అందిస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఆధునిక సాగు విధా నాలపై అవగాహన పెంచుకోవా లని రైతులకు సూచించారు. వ్య వసాయ ప్రదర్శనలు రైతులకు నూతన ఆవిష్కరణలు, ఆధు నిక యంత్రాలు, సాంకేతిక పద్ధ తులను పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొ న్నారు.

రైతు బాగుంటేనే దేశం బాగుం టుంది

నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీని వాసరెడ్డి మాట్లాడుతూ నల్లగొం డలో వ్యవసాయ ప్రదర్శన నిర్వ హించడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. రైతు దేశానికి వెన్నె ముక అని, రైతు పండిస్తేనే ప్రజ లకు అన్నం లభిస్తుందని పేర్కొ న్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరో సా, రైతు బీమా వంటి పథకాల ను అమలు చేస్తోందని తెలిపా రు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని తక్కువ నీటితో పండిం చే పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు.ఈ కా ర్యక్రమంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విష్ణు కృష్ణ, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నర్సింహారెడ్డి, జూలకం టి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చె రుకు సీతారాములు, మాజీ ము న్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, మల్లు లక్ష్మి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, జూలకంటి రాజేందర్, ప్రమీల, స్టాళ్ల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.







ఎయిర్‌టెల్ టవర్లే టార్గెట్

ఇంజినీర్ల ముఠా గుట్టురట్టు, పనిచేస్తున్న సంస్థకే కన్నం, 38 చోరీ కేసుల్లో తొమ్మిది మంది అరెస్ట్
రూ.1.62 కోట్ల విలువైన రేడియో రిమోట్ యూనిట్ల చోరీ
నల్లగొండ సీసీఎస్ పోలీసుల మెరుపు ఆపరేషన్
వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్





ప్రజా దీవెన, నల్లగొండ: నమ్మకం గా పనిచేస్తున్న సంస్థకే కొందరు ఉద్యోగులు కన్నం వేశారు. తమ కు ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ఖరీదైన ఎయిర్‌టెల్ మొబైల్ టవర్ల రేడి యో రిమోట్ యూనిట్లను (R RU) లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా గుట్టును నల్లగొండ సీసీఎస్ పోలీ సులు రట్టు చేశారు. ఈ వ్యవహా రంలో సంస్థలో పనిచేస్తున్న ము గ్గురు ఇంజినీర్లు, టెక్నీషియన్లు సహా మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లా ల్లో ఏకంగా 38 చోరీలకు పాల్ప డిన ఈ ముఠా సుమారు రూ. 1. 62 కోట్ల విలువైన రేడియో రిమో ట్ యూనిట్లను అపహరించిన ట్లు పోలీసుల దర్యాప్తులో వెల్ల డైంది. నిందితుల నుంచి రూ. 25 లక్షల విలువైన మూడు కార్లు, రెండు బైకులు, రూ. 15 లక్షల న గదు, ఎనిమిది మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు.

ప్రత్యేక బృందాలతో రంగంలోకి పోలీసులు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మొబై ల్ టవర్లకు సంబంధించిన ఖరీదై న రేడియో రిమోట్ యూనిట్లు వ రుసగా చోరీ అవుతుండటంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేక దృష్టి సారించారు. సీసీఎ స్ ఇన్‌స్పెక్టర్ ఎం.జితేందర్ రెడ్డి పర్యవేక్షణలో రెండు ప్రత్యేక పో లీసు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.మొదట ఈ చోరీల వెనుక బయటి వ్యక్తుల హస్తం ఉందని భావించిన పోలీ సులు సాంకేతిక ఆధారాలు, ని ఘా సమాచారంతో లోతుగా విచారణ చేపట్టారు. అయితే, ఈ దొంగతనాలకు పాల్పడుతున్నది అదే సంస్థలో పనిచేస్తున్న ఇంజి నీర్లు, రిగ్గర్లు, టెక్నీషియ న్లు, డ్రై వర్‌తో పాటు గతంలో సంస్థలో పనిచేసిన వ్యక్తి అని గుర్తించి వి స్తుపోయారు.

రాత్రివేళల్లో టవర్లపై దోపిడీ

విలాసవంతమైన జీవితానికి అ లవాటుపడి తక్కువ సమయం లో ఎక్కువ డబ్బు సంపాదించా లనే దురాశతో నిందితులు ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. తమ పరి ధిలోని మొబైల్ టవర్లపై ఉన్న ఖ రీదైన ఆర్ఆర్‌యూ యూనిట్లను ముందుగానే గుర్తించి, రాత్రివేళ ల్లో టవర్ల వద్దకు చేరుకునేవారు. తమకు తెలిసిన సాంకేతిక పరి జ్ఞానంతో వైర్లను కత్తిరించి యూ నిట్లను తొలగించి అపహరించే వారు. అనంతరం వాటిని హైద రాబాద్‌లో విక్రయించి వచ్చిన డ బ్బుతో కార్లు, బైకులు కొనుగోలు చేయడంతో పాటు విలాసాలకు ఖర్చు చేసేవారని పోలీసుల వి చారణలో వెల్లడైంది.

వాహన తనిఖీలతో చిక్కిన ము ఠా

నవంబర్ 14న నల్లగొండ రూరల్ పోలీసుల బృందం గిగిరకలబా వి గూడెం శివారులోని చింతచెట్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహి స్తుండగా రెండు కార్లు, ఒక బైక్‌పై అనుమానాస్పదంగా వస్తున్న ఐ దుగురిని అదుపులోకి తీసు కుం ది. విచారణలో వారు కాంచన ప ల్లి ప్రాంతంలో ఆర్ఆర్‌యూ యూనిట్ల చోరీకి వెళ్తున్నట్లు వెల్ల డించారు. అదే సమయంలో త్రిపురారం పో లీసులు బాబాసాయిపేట వద్ద ని ర్వహించిన వాహన తనిఖీల్లో మ రో నలుగురిని అదుపులోకి తీ సుకున్నారు. వారిలో గతంలో నే రాలకు పాల్పడిన వ్యక్తి కూడా ఉ ండటంతో మరింత లోతుగా విచారించగా, గతంలో జరిగిన పలు చోరీల వివరాలు వెలుగు లోకి వచ్చాయి.

38 చోరీ కేసులు.. జిల్లాలవారీగా వివరాలు

పోలీసుల విచారణలో ఈ ముఠా మొత్తం 38 చోరీ కేసుల్లో పాల్గొ న్నట్లు గుర్తించారు.నల్లగొండ 9 కేసులు, మిర్యాలగూడ 16 కేసు లు,దేవరకొండ2 కేసులు, సూ ర్యాపేట 8 కేసులు, ఇతర జిల్లా లు 3 కేసులు,ఈ కేసును సమ ర్థ వంతంగా ఛేదించి తొమ్మిది మం ది నిందితులను అరెస్టు చేయ డంలో కీలక పాత్ర పోషించిన త్రి పురారం ఎస్ఐ కె.నరేష్, నల్ల గొం డ రూరల్ ఎస్ఐ, సీసీఎస్ ఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు విష్ణు వర్ధన్ గిరి, పుష్పగిరి, ఫయాజ్, నాగరాజు, కానిస్టేబుళ్లు అస్రార్, సాయి, శివరాజు, నరేష్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటిం చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని నేరాలకు ఉపయోగించినా చట్టం నుంచి తప్పించుకోలేరనే విషయాన్ని ఈ కేసు మరోసారి స్పష్టం చేసింది.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం వ్యక్తిత్వ వికాసం

గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దేందు కు కృషి
నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: పుస్తకం మనకు అమ్మలాంటిద ని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ గ్రం థాలయాలకు వచ్చి పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. షార్ట్‌కట్ చదువులకు స్వస్తి పలికి, పుస్తకాలను పూర్తిగా చదివి విషయ పరిజ్ఞానాన్ని, అవగాహనను పెంపొందించుకోవాలని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జిల్లాలోని గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్, బాలల దినోత్సవం సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సరస్వతీ దేవి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, విద్యార్థులు, యువత పుస్తక పఠనాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని అన్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానంతో పాటు ఆలోచనా శక్తి, విశ్లేషణ సామర్థ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంలో డిజిటల్ పుస్తకాలు, ఆన్‌లైన్ గ్రంథాలయ సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు.జిల్లాలో గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 కేటగిరీల్లో మొత్తం 23 గ్రంథాలయాలు ఉన్నాయని తెలిపారు. నేషనల్ డిజిటల్ లైబ్రరీ మిషన్ ద్వారా పాఠకులకు మరిన్ని పుస్తకాలు, విజ్ఞాన వనరులు అందుబాటులోకి తీసుకురావచ్చని చెప్పారు. గ్రంథాలయాల్లో పుస్తకాల సంఖ్యను పెంచడంతో పాటు, డిజిటల్ సదుపాయాలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు ప్రతిరోజూ భోజన సదుపాయం కల్పించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మంచి కార్యక్రమానికి సహకరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత ప్రతిరోజూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవాలని, సంప్రదాయ పుస్తకాలతో పాటు డిజిటల్ గ్రంథాలయ సేవలను కూడా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పుస్తక పఠనం ద్వారా ప్రతి ఒక్కరూ తమ జ్ఞానాన్ని పెంపొందించుకో వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , స్థానిక కార్పొరేటర్ మామిడి కా ర్తీక్,మాజీ గ్రంథాల చైర్మన్ గాధ వినోద్ రెడ్డి ,ప్రతిక్ ఫౌండేషన్ సీ ఈఓ గోనా రెడ్డి,గ్రంథాలయ కార్యదర్శి బాలమ్మ,గ్రంథాలయ అధికారీ ఎన్. వేణుగోపాలచా ర్యులు,ఆర్ కుసుమాశ్రీ ,రాజేష్, సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.





వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీసీలదే అధికారం

80 మంది బీసీ ఎమ్మెల్యేలను ఎమ్మెల్యేలుగా గెలిపించుకుం టాం
దొరల పటేళ్ల పాలనకు కాలం చెల్లింది
అన్ని రాజకీయ పార్టీలు తమ బీసీ రాజకీయ పాలసీ ప్రకటించాలి
రంగారెడ్డి జిల్లా అగ్రకులాలకు అడ్డగా మారింది
ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన బీసీలకు ఒరిగింది ఏమీ లేదు
బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



ప్రజా దీవెన, తాండూరు: వచ్చే 2028 సార్వత్రిక ఎన్నికల్లో 80 మంది బీసీ ఎమ్మెల్యేలను గెలి పించుకుంటామని, తద్వారా తె లంగాణ రాష్ట్రంలో బీసీలకు రా జకీయ అధికారశీ దక్కడం ఖా యమని, బీసీల రాజకీయ సు నామిని ఇక ఏ శక్తి అడ్డుకోచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు నేడు తాండూరు పట్టణ కేంద్రంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా రెడ్డి గణపురం గ్రామానికి చెందిన ఈడిగ శ్రీనివాస్ గౌడ్ ఎన్నికైన సందర్భంగా తాండూరు పట్టణంలో విలేమున్ చౌరస్తా నుండి ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్ వరకు భారీ బైక్ రైలు నిర్వహించారు తాండూరు చౌరస్తా కూడలిలో బీసీ సంఘాల కార్యకర్తలు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ స్వాగతం పలికి భారీ గజమాల వేశారు అనంతరం ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్ జరిగిన బీసీ ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం లో జాజుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడికెడు శాతం లేని వారు రాజ్యమేలుతుంటే మెజార్టీ ఉన్న బీసీలు తరతరాలుగా బాధితులుగా మారుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు తెలంగాణ రాష్ట్రంలో దొరల పటేల్ల పాలనకు చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు మెజారిటీగా ఉ న్న బీసీలను ఐక్యంగా అగ్రకుల రాజకీయ పార్టీలకు గుద్దు చేస్తున్నాయని, అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో బీసీలకు టికెట్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీ రాజకీయ పాలసీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు బీసీల ఓట్లతో గెలిచిన పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను విస్మరిస్తున్నాయని బీసీ కులగలను చేయాలని ఓబీసీ కాలం చేపట్టాలని ఉద్యమాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు, అన్ని వర్గాలకు జనాభాస్ ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తున్న ప్రభుత్వాలు బీసీలకు మాత్రం 60 శాతం పైగా ఉన్న 27% మాత్రమే రిజర్వేషన్ కల్పించి అన్యాయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు ఓటు మనదే సీటు మనదే అనే నినాదంతో రాష్ట్రమంతా పర్యటించి బీసీ బిడ్డలను అసెంబ్లీకి పంపించడమే లక్ష్యంగా బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నామని అందులో భాగంగానే రంగారెడ్డి జిల్లాలో సగం అసెంబ్లీ స్థానాలను బీసీలు కైవసం చేసుకునే విధంగా రాజకీయ ప్రణాళిక రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు తాండూరు గడ్డ బీసీలకు అడ్డా అని అలాంటి తాండూరులో బీసీ ఎమ్మెల్యే రాకుండా కుట్ర చేస్తున్నారని ఎన్ని కుట్రలు చేసినా బీసీలంత ఐక్యమత్యంతో రాజకీయ పార్టీల కచ్చితంగా ఏకమై వచ్చే 2008 ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గంలో బీసీ ఎమ్మెల్యేను గెలిపించుకొని తాండూరు గడ్డపై బీసీ జెండా ఎగిరేవేయాలని ఆయన పిలుపునిచ్చారు బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మా, మున్సిపల్ చైర్మన్ పటోళ్ల నీరజ, మాజీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్లు మురళీకృష్ణ, రాజు గౌడ్, మాజీ జెడ్పిటిసి రాకేష్ మహారాజ్, డాక్టర్ సంపత్ కుమార్, టీజేఎస్ కన్వీనర్ సోమశేఖర్, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మధుసూదన్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మధు లత, బిజెపి పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, కౌన్సిలర్లు రామకృష్ణ, బంటు వేణు, రిటైర్డ్ ఎంఈఓ వెంకటయ్య, నారాయణ గౌడ్, ఈశ్వర్, నరసింహులు గౌడ్, సావిత్రి ముదిరాజ్, లు పాల్గొన గా మర్యాద రామకృష్ణ సభా ధ్యక్షులుగా వివరించగా వంద లాదిమంది పాల్గొన్నారు.

శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన విలేఖరులను సన్మానించిన ఈవో



ప్రజా దీవెన కోదాడ : సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం పత్రిక విలేకరులు సందర్శించారు ఈ సందర్భంగా ఆలయ ఈవో నాగిళ్ల శంబిరెడ్డి, దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెండ్లి లచ్చయ్య వారి చేతుల మీదుగా హుజూర్నగర్ ఈనాడు విలేఖరి, మేళ్లచెరువు ఈనాడు విలేఖరి కోదాడ ప్రజా దీవెన విలేకరులను సాల్వులతో ఘనంగా సన్మానించి స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు విష్ణువర్ధన్ శర్మ ధనుంజయ శర్మలు వేదమంత్రాలతో ఆశీర్వాద వచనాలు పలికారు ఈ సందర్భంగా విలేకరులు దేవాలయ ఈవో, చైర్మన్, దేవాలయ కమిటీ సభ్యులకు అర్చకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాపుగల్లులో ఘనంగా బాలల దినోత్సవం



ప్రజా దీవెన, కోదాడు: మండల పరిధిలోని కాపుగల్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దొంతగాని అప్పారావు అధ్యక్షతన బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్యవివాహాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుకుల రామారావు, పంచాయతీ కార్యదర్శి కావ్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బైరు సైదులు గౌడ్

ప్రభుత్వ శాఖల్లో సమాచార హ క్కు చట్టం అమలుకు కృషి చే యాలి
జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: నల్గొండ జిల్లా ఆర్టీఐ (సమాచార హక్కు) మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నల్గొండ పట్టణానికి చెందిన బైరు సైదులు గౌడ్ నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నియామక ఉత్తర్వులు జారీ చేయగా, శుక్రవారం కలెక్టర్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో సమాచార హక్కు చట్టం – 2005 సమర్థవంతంగా అమలయ్యేలా కమిటీ సభ్యుడు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులకు చట్టంపై అవగాహన కల్పిస్తూ, సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకునే పౌరులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బైరు సైదులు గౌడ్ మాట్లాడుతూ.. గత పదేళ్లుగా సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలు, ప్రజల్లో అవగాహన కల్పన కోసం చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యత అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, ఆర్డీఓ అశోక్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ అధికారులకు, సామాన్య ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు పారదర్శకమైన పాలన అందేలా నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, సమాచారాన్ని పొందడంలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు.తన నియామకానికి సహకరించిన సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి, మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కాచం సత్యనారాయణ, దయాకర్ రావు, మారం గోనారెడ్డి, కోటగిరి ధైవాధీనం, గందమళ్ళ జయంత్, గాదె వినోద్ రెడ్డి, యర్రమాద హేమలత, బోగరి రామకృష్ణ, యాళ్ల చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం శ్రీనివాస్, కర్నాటి యాదగిరి, కార్యదర్శి తుంగతుర్తి రామకృష్ణ, గంటేకంపు గణేష్, బీమనపల్లి నగేష్, అదిమల్ల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి



ప్రజా దీవెన నల్లగొండ క్రైమ్: జిల్లాలో నేర నియంత్రణ, పెండిం గ్ కేసుల దర్యాప్తు పురోగతి, నేరాల నివారణకు చేపడుతున్న చర్యలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పోలీసు అధికారులతో నేర సమీ క్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదవుతున్న నేరాల తీరును, కేసుల దర్యాప్తు పురోగతిని సమగ్రంగా సమీక్షించిన ఎస్పీ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నిందితులకు శిక్ష పడే విధంగా పక్కా ఆధారాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, కేసుల పరిష్కారంలో నాణ్యతతో పాటు నిర్ణీత కాలపరిమితిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కేసుల దర్యాప్తును మరింత శాస్త్రీయంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా చేపట్టేందుకు 'ఈ-సాక్ష్య' యాప్‌ను ప్రతి దర్యాప్తు అధికారి తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ గారు ఆదేశించారు.కేసు దర్యాప్తులో భవిష్యత్‌లో ఎలాంటి సందేహాలకు తావులేకుండా ఆధారాలను పద్ధతిగా భద్రపరచడంతో పాటు, కోర్టులో నిందితులకు శిక్ష పడే విధంగా దర్యాప్తు ప్రక్రియను శాస్త్రీయ ఆధారాలతో బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్లలో రికార్డుల నిర్వహణ, కేసుల వివరాల నమోదు, దర్యాప్తు పురోగతి, జబ్బుచీ, వ-ాఘనెంష్టమ్ఘి వంటి సాంకేతిక వ్యవస్థల వినియోగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు ముందస్తు నేర నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ గారు ఆదేశించారు. పాత నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై తక్షణమే స్పందించాలని సూచించారు. నేరాలు జరిగిన తర్వాత స్పందించడంతో పాటు నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. బీట్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి, స్థానికంగా సమస్యాత్మక ప్రాంతాలు, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, నేరస్తుల కదలికలను గుర్తించడం, నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నందున పట్టణాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలు, ముఖ్యమైన రహదారుల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటును మరింత విస్తరించాలని ఎస్పీ సూచించారు. ప్రజలు, వ్యాపార సంస్థలు, స్థానిక సంస్థల సహకారంతో మరిన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాలు నిరంతరం పనిచేసేలా వాటి పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే సరిచేయించాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ గారు అధికారులను ఆదేశించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని ఎస్పీ సూచించారు. మాదకద్రవ్యాల సరఫరా గొలుసును గుర్తించి, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణా, ఇసుక అక్రమ మైనింగ్, పీడీఎస్ బియ్యం మరియు ఇతర నిత్యావసర వస్తువుల అక్రమ తరలింపులు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి అన్నారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సమస్యలను సానుకూలంగా విని, చట్టపరమైన పరిధిలో సత్వర పరిష్కారం చూపాలని ఎస్పీ గారు సూచించారు. బాధితుల ఫిర్యాదులపై నిర్లక్ష్యం లేకుండా స్పందించాలని, ప్రజలకు న్యాయం అందించే విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేర నియంత్రణ, నేరాల ఛేదన, కేసుల దర్యాప్తు, కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెంపు వంటి అంశాలపై అధికారులు నిరంతరం దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ లు,మల్లారెడ్డి,శివరాం రెడ్డి,శ్రీని వాస్ రావు, లక్ష్మి నారాయ ణ,సీఐలు, ఎస్ఐలు మరియు సం బంధిత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అండర్-19 ఆసియా కప్ విజేత భారత్

ఆఖరి బంతికి సంచలనం..
1 వికెట్ తేడాతో పాకిస్థాన్‌పై విజయం
ఒమన్ లో అండర్-19 ఆసియా కప్..
దాయాదుల మధ్య టైటిల్ సమరం
ఆఖరి బంతి వరకు ఉత్కంఠభరితం..
పాకిస్థాన్‌పై భారత్ గెలుపు
మొదట బ్యాటింగ్ చేసి 50 ఓవర్లలో 337 పరుగులు సాధించిన పాకిస్థాన్
లక్ష్య ఛేదనలో 309 పరుగుల వద్ద 9వ వికెట్ కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ భారత్
ఆఖరి వికెట్‌కు అజేయంగా 30 పరుగులు జోడించి జట్టును గెలిపించిన మోహిత్ ఉల్వా, వెంకట





ఒమన్ లోని అల్ అమరత్ వేదికగా జరిగిన ఏసీసీ పురుషుల అండర్-19 ఆసియా కప్ ను భారత చేజిక్కించుకుంది. ఇవాళ జరిగిన ఫైనల్ మ్యాచ్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత ఉత్కంఠభరిత పోరుగా నిలిచిపోతుంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన హైవోల్టేజ్ సమరంలో భారత యువ జట్టు అద్భుత పోరాట పటిమ కనబరిచింది. మ్యాచ్ దాదాపు చేజారిపోయి, ఓటమి ఖాయమనుకున్న దశ నుంచి అద్భుతంగా పుంజుకుని కేవలం 1 వికెట్ తేడాతో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ఆఖరి బంతికి భారత్ విజయానికి 3 పరుగులు కావాల్సి ఉండగా, మోహిత్ ఉల్వా ఫోర్ కొట్టడంతో మైదానంలో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. ఈ సంచలన విజయంతో భారత్ అండర్-19 ఆసియా కప్ చాంపియన్‌గా అవతరించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. పాక్ బ్యాటర్లలో ఉస్మాన్ ఖాన్ అద్భుత సెంచరీతో (111 బంతుల్లో 107) కదం తొక్కగా, అబ్దుల్ ఖాదిర్ మెరుపు ఇన్నింగ్స్ (54 బంతుల్లో 80), కెప్టెన్ ఫర్హాన్ యూసఫ్ (60 బంతుల్లో 63) రాణించారు. భారత బౌలర్లలో కావ్య పటేల్ 4 వికెట్లతో సత్తా చాటగా, చిగురుపాటి వెంకట 3 వికెట్లు పడగొట్టాడు. 338 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత యువ జట్టుకు ఓపెనర్లు లక్ష్య రాజేష్ రాయ్‌చందాని (101 బంతుల్లో 80), ఆర్యవీర్ సెహ్వాగ్ (61 బంతుల్లో 58) బలమైన పునాది వేశారు. మొదటి వికెట్‌కు వీరిద్దరూ 95 పరుగులు జోడించారు. అనంతరం వీకే వినీత్ (24), మనాల్ చౌహాన్ (32 బంతుల్లో 47) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అయితే, వరుస విరామాల్లో వికెట్లు కోల్పోవడంతో భారత్ తీవ్ర ఒత్తిడిలో పడింది. ఒక దశలో 252 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన భారత్‌ను మనాల్ చౌహాన్, మోహిత్ ఉల్వా ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ 47.2 ఓవర్ల వద్ద జట్టు స్కోరు 309 పరుగుల వద్ద ఉన్నప్పుడు మనాల్ చౌహాన్ 9వ వికెట్‌గా వెనుదిరగడంతో మ్యాచ్ భారత్ చేతుల్లోంచి జారిపోయిందని అందరూ భావించారు. పాకిస్థాన్ విజయం లాంఛనమే అనుకుంటున్న తరుణంలో క్రీజులోకి వచ్చిన 11వ నంబర్ బ్యాటర్ చిగురుపాటి వెంకటతో కలిసి మోహిత్ ఉల్వా వీరోచిత పోరాటం చేశాడు. ఓటమి అంచున నిలిచిన వేళ వీరిద్దరూ అసాధారణ సంయమనం, ధైర్యం ప్రదర్శించారు. మోహిత్ ఉల్వా కేవలం 26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో తుపాను ఇన్నింగ్స్ ఆడి అజేయంగా 49 పరుగులు చేశాడు. అతనికి తోడుగా చిగురుపాటి వెంకట 8 బంతుల్లో 2 ఫోర్లతో విలువైన 11 పరుగులు సాధించాడు. వీరిద్దరూ ఆఖరి వికెట్‌కు కేవలం 16 బంతుల్లోనే అజేయంగా 30 పరుగులు జోడించి, 50 ఓవర్లలో 339 పరుగులు చేసి భారత జట్టుకు ఊహించని విజయాన్ని అందించారు. ఓటమి కోరల్లోంచి మ్యాచ్‌ను లాక్కొచ్చి ట్రోఫీని ముద్దాడిన భారత యువ జట్టు ప్రదర్శనపై క్రీడా వర్గాల్లో సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

టీమిండియాలో అనూహ్య మార్పు

టెస్టు జట్టులోకి గుర్నూర్ బ్రార్.. కుల్దీప్ విడుదల



న్యూజిలాండ్‌తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు భారత జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. యువ పేసర్ గుర్నూర్ బ్రార్‌కు సెలక్టర్లు అవకాశం కల్పించారు. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉండడు. మరోవైపు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ టెస్టు జట్టు నుంచి విడుదలయ్యాడు. దేశవాళీ క్రికెట్‌లో ఉత్తరప్రదేశ్ జట్టు తరఫున ఆడేందుకు అతడిని అనుమతించారు. ఈ విషయాలను బీసీసీఐ శనివారం వెల్లడించింది. నవంబర్ 19 నుంచి వెల్లింగ్టన్‌లో ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్ కోసం గుర్నూర్ బ్రార్‌ను ఎంపిక చేసినట్లు బీసీసీఐ తెలిపింది. అతడు నేరుగా టెస్టు జట్టుతో కలవనున్నాడు. ఆదివారం జరిగే చివరి వన్డేకు అందుబాటులో ఉండడు. అతడి స్థానంలో మరో ఆటగాడిని ఎంపిక చేయడం లేదని స్పష్టం చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఇప్పటికే వెల్లింగ్టన్‌లోని టెస్టు జట్టుతో చేరాడు. కుల్దీప్ యాదవ్ దేశవాళీ టోర్నీల్లో పాల్గొనేందుకు స్వదేశానికి తిరిగి రానున్నాడు. ఉత్తరప్రదేశ్ జట్టు తరఫున ఆడనున్నాడు. సీనియర్ ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ మూడో వన్డే తర్వాత టెస్టు జట్టుతో చేరేందుకు వెళ్లడంతో నాలుగో మ్యాచ్‌లో భారత్ ఇబ్బందులు ఎదుర్కొంది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 334 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో భారత బ్యాటింగ్ విభాగం కేవలం 89 పరుగులకే కుప్పకూలింది. మాట్ హెన్రీ ఆరు వికెట్లతో చెలరేగాడు. దీంతో భారత్ 244 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. వన్డేల్లో పరుగుల పరంగా టీమిండియాకు ఇది రెండో అతిపెద్ద ఓటమి. ఆదివారం వన్డే సిరీస్ ముగిసిన తర్వాత ఇరు జట్లు రెండు టెస్టుల్లో తలపడనున్నాయి. వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానం తొలి టెస్టుకు వేదిక కానుంది.

భారత టెస్టు జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, అన్షుల్ కాంబోజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, మహమ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్.

ఐదో వన్డేకు భారత జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్, నమన్ ధీర్, జొకిబ్ నబీ, రుతురాజ్ గైక్వాడ్, అర్ష్‌దీప్ సింగ్, కుమార్ కుశాగ్ర, మహమ్మద్ సిరాజ్, యశ్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్.

వైభవ్ సూర్యవంశీ మరో సంచలనం..

15 ఏళ్లకే కెప్టెన్‌గా ప్రపంచ రికార్డు



భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరో అరుదైన ఘనత సాధించాడు. పురుషుల టీ20 క్రికెట్ చరిత్రలో ఓ జట్టుకు కెప్టెన్సీ వహించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. శనివారం ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో సౌరాష్ట్రతో జరిగిన 2026-27 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో బీహార్ జట్టుకు నాయకత్వం వహించాడు. ప్రస్తుతం వైభవ్ వయసు 15 ఏళ్ల 232 రోజులు మాత్రమే. ఇప్పటివరకు ఈ రికార్డు క్రొయేషియాకు చెందిన జాక్ వుకుసిచ్ పేరిట ఉండేది. అతడు 17 ఏళ్ల 311 రోజుల వయసులో తన జాతీయ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇప్పుడు సూర్యవంశీ ఆ రికార్డును అధిగమించాడు. దీంతో పురుషుల టీ20ల్లో జట్టును నడిపించిన అత్యంత చిన్న వయస్కుడిగా చరిత్రకెక్కాడు. బీహార్ కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లో సూర్యవంశీ బ్యాటింగ్‌లో మాత్రం పెద్దగా రాణించలేకపోయాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బీహార్ తరఫున 12 బంతుల్లో 18 పరుగులు చేశాడు. ఎడమచేతి వాటం పేసర్ చేతన్ సకారియా బౌలింగ్‌లో క్యాచ్ అండ్ బౌల్డ్‌గా వెనుదిరిగాడు. ఈ టోర్నీలో బీహార్ తరఫున సూర్యవంశీ ఎక్కువ మ్యాచ్‌లు ఆడే అవకాశం లేదు. సౌరాష్ట్రతో మ్యాచ్ తర్వాత మరో మ్యాచ్ ఆడగానే దోహాలో జరగనున్న ఏసీసీ రైజింగ్ స్టార్స్ ఎమర్జింగ్ టోర్నీ కోసం భారత్-ఏ జట్టుతో చేరనున్నాడు. నవంబర్ 19 నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీలు 50 ఓవర్ల ఫార్మాట్‌లో జరగనున్నాయి. ఇటీవల న్యూజిలాండ్ పర్యటనలో భారత్ తరఫున రెండు టీ20లు ఆడిన సూర్యవంశీ.. ఓ మ్యాచ్‌లో అభిషేక్ శర్మతో కలిసి తొలి వికెట్‌కు కేవలం 7.1 ఓవర్లలోనే 133 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో 19 బంతుల్లో 45 పరుగులు చేశాడు. ఆ సిరీస్‌ను భారత్ 3-2తో గెలుచుకుంది. బీహార్ తరఫున సూర్యవంశీకి ఇది ఎనిమిదో టీ20 మ్యాచ్ కాగా, ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన 23 మ్యాచ్‌లతో కలిపి మొత్తం 44వ టీ20 మ్యాచ్. గతేడాది నవంబరులో భారత్-ఏ తరఫున యూఏఈపై 42 బంతుల్లో 144 పరుగులు చేసి సంచలనం సృష్టించాడు. టీ20ల్లో అత్యంత వేగంగా సెంచరీలు చేసిన భారత బ్యాటర్ల జాబితాలో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాడు.

తొలి ఓవర్‌లోనే ఎందుకు ఔటవుతున్నాడు?

రోహిత్ లోపాన్ని బయటపెట్టిన కైఫ్

వన్డే ప్రపంచకప్-2027కు సిద్ధమవుతున్న టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఫామ్‌పై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ఆందోళన వ్యక్తం చేశాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో రోహిత్ తక్కువ స్కోర్లకే వెనుదిరుగుతుండటానికి అతడి బ్యాటింగ్ టెక్నిక్‌లోని ఓ లోపమే కారణమని అభిప్రాయపడ్డాడు. బంతి ఎదుర్కొనే సమయంలో ముందుకూ వెళ్లకుండా, వెనక్కి కదలకుండా మధ్యలోనే నిలిచిపోతున్నాడని విశ్లేషించాడు. ఈ సిరీస్‌లో మూడు ఇన్నింగ్స్ ఆడిన రోహిత్ మొత్తం 23 పరుగులే చేశాడు. తొలి, నాలుగో వన్డేల్లో డకౌట్‌గా వెనుదిరిగాడు. ముఖ్యంగా మౌంట్ మౌంగనుయ్‌లో జరిగిన నాలుగో వన్డేలో మాట్ హెన్రీ వేసిన తొలి బంతికే స్లిప్స్‌లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. రోహిత్ ఔటవుతున్న తీరుపై కైఫ్ తన యూట్యూబ్ ఛానల్‌లో స్పందించాడు. పిచ్‌పై బంతి కదలిక ఉన్నప్పుడు రోహిత్ కాళ్లు కదపకుండా ఆడుతున్నాడని చెప్పాడు. బంతి కొంత షార్ట్‌గా వచ్చినప్పుడు పూర్తిగా వెనక్కి వెళ్లడం లేదని, ముందుకు వచ్చి ఆడేందుకు కూడా ప్రయత్నించడం లేదని వివరించాడు. కెరీర్‌లో ఎన్నోసార్లు తొలి ఓవర్‌లో ఇలాంటి లెంగ్త్ బంతులకే రోహిత్ వికెట్ సమర్పించుకున్నాడని పేర్కొన్నాడు.

దంచికొట్టిన సూర్యకుమార్ 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ

టీమిండియా టీ20 మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తనదైన శైలిలో అద్భుతమైన పునరాగమనం చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2026లో భాగంగా హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై కెప్టెన్‌గా బరిలోకి దిగిన సూర్య, విధ్వంసకర ఇన్నింగ్స్‌తో జట్టుకు ఘన విజయాన్ని అందించాడు. కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన సూర్య, తన ఫామ్ ఏమాత్రం తగ్గలేదని నిరూపించాడు. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ నిర్దేశించిన 173 పరుగుల లక్ష్యాన్ని ముంబై జట్టు 6 ఓవర్లకు పైగా మిగిలి ఉండగానే కేవలం 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన సూర్యకుమార్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 21 బంతుల్లో 5 సిక్సర్లు, 6 ఫోర్లతో 60 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఏడాది మే నెలలో ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన తర్వాత సూర్యకుమార్ ఆడిన తొలి ప్రొఫెషనల్ మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. ఇటీవలే టీ20 ప్రపంచకప్‌కు ముందు భారత టీ20 జట్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి సూర్యకుమార్‌ను తప్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 36 ఏళ్ల వయసులో దేశవాళీ క్రికెట్‌లోకి తిరిగి రావడంపై అందరి దృష్టి నెలకొంది. అయితే, తనపై ఉన్న అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. ముంబై జట్టు కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే జట్టును ముందుండి నడిపించి, తన నియామకం సరైనదేనని నిరూపించుకున్నాడు.



అనిల్ రావిపూడితో జూనియర్ ఎన్టీఆర్..

టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో సరికొత్త చిత్రం పట్టాలెక్కనుంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను శనివారం (నవంబర్ 14) ఎన్టీఆర్, అనిల్ రావిపూడి స్వయంగా ప్రకటించారు. ఎక్స్ వేదికగా దర్శకుడు అనిల్ రావిపూడితో కలిసి ఉన్న ఫొటోను పంచుకున్న ఎన్టీఆర్, ఈ ప్రాజెక్ట్‌పై క్లారిటీ ఇచ్చారు. "ఈ చిత్రం ఒక నవ్వుల జాతరలా ఉండబోతోంది" (This oneus going to be a laugh riot) అని పేర్కొంటూ #NTRxAnilRavipudi అనే హ్యాష్‌ట్యాగ్‌ను జత చేశారు. ఈ పోస్ట్‌లో తన సోదరుడు నందమూరి కల్యాణ్ రామ్‌తో పాటు ఎన్టీఆర్ ఆర్ట్స్ నిర్మాణ సంస్థను కూడా ట్యాగ్ చేశారు. ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్ రామ్ ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. సాధారణంగా జూనియర్ ఎన్టీఆర్ హై-వోల్టేజ్ మాస్, యాక్షన్ కథాంశాలకు ప్రసిద్ధి చెందగా, అనిల్ రావిపూడి నాన్‌స్టాప్ కామెడీ ఎంటర్‌టైనర్లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. పూర్తి విరుద్ధమైన శైలులు కలిగిన ఈ ఇద్దరి కలయిక సినీ వర్గాలతో పాటు ప్రేక్షకుల్లోనూ భారీ ఆసక్తిని, ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమా చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే అనిల్ రావిపూడి దర్శకత్వంలోని చిత్రం ప్రారంభం కానుంది. మరోవైపు, అనిల్ రావిపూడి ప్రస్తుతం వెంకటేశ్, కల్యాణ్ రామ్ కాంబినేషన్‌లో ఒక సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం 2027 సంక్రాంతికి విడుదల కానుంది. ఎన్టీఆర్, అనిల్ రావిపూడి సినిమా అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే సోషల్ మీడియాలో #NTRxAnilRavipudi హ్యాష్‌ట్యాగ్ భారీగా ట్రెండ్ అవుతోంది. బాక్సాఫీస్ వద్ద ఈ నవ్వుల విందు సరికొత్త రికార్డులు సృష్టిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక బృందం మరియు రెగ్యులర్ షూటింగ్ వివరాలను చిత్ర యూనిట్ త్వరలోనే ప్రకటించనుంది.

అనసూయకు అవకాశాలు తగ్గిన వేళ!

బుల్లితెరపై యాంకర్‌గా ప్రత్యేక గుర్తింపు అనంతరం వెండితెరపై విలక్షణ నటిగా దూసుకెళ్లిన అనసూయ భరద్వాజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. యాంకర్ గా కెరీర్ ప్రారంభించి నటిగా స్థిరపడటం అంత సులభం కాదు. కానీ అనసూయ మాత్రం దాన్ని సుసాధ్యం చేసి చూపించింది. ఆ రకంగా నవతరం యాంకర్లకు ఆదర్శంగానూ నిలిచింది. అయితే అనసూయ కెరీర్ లో ఇప్పుడు గ్యాప్ కనిపిస్తుంది. రెండేళ్ల క్రితం వరకూ వరుస సినిమాలతో.. కీలకమైన పాత్రలతో టాలీవుడ్‌లో ఫుల్ బిజీగా ఉన్న భామకు ఏడాదిన్నరకాలంగా ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదనే చర్చ ఫిలింనగర్ లో గట్టిగా వినిపిస్తోంది. గత ఏడాది ఒకటిరెండు చిత్రాల్లో పలకరించిన అనసూయ ఈ ఏడాది మాత్రం ఒక్క సినిమాలో కూడా కనిపించకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏడాది ముగింపు వచ్చిన తరుణంలో అనసూయ ఖాతాలో కొత్త ప్రాజెక్ట్‌లు లేకపోవడంతో అమ్మడి కెరీర్‌లో ఊహించని మలుపుగా హైలైట్ అవుతుంది. ఒక్కసారి అనసూయ కెరీర్ చూస్తే.. -రంగస్థలం- చిత్రంలో రంగమ్మత్త పాత్రతో నటిగా గోల్డెన్ పీరియడ్ ప్రారంభమైంది. అనంతరం -క్షణం-, -ఖిలాడి-, -పుష్ప- వంటి సినిమాల్లో విభిన్నమైన పాత్రలు పోషించి అభినయంతో అందరినీ ఆకట్టుకున్నారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ఆస్కారం ఉన్న బలమైన పాత్రలను ఎంచుకుని ముందుకెళ్లారు. ఒక దశలో అనసూయ తెలుగుతో పాటు ఇతర భాషా చిత్రాల్లోనూ బిజీ అయినట్లు కనిపించింది. అయితే ఈ రెండేళ్ల కాలంగా అమ్మడు జోరు తగ్గడం గమనించదగ్గ పరిణామం. ఇలా ఆఫర్లు తగ్గడానికి ప్రధాన కారణం కథల ఎంపికలో రంగమ్మత్త అనుసరిస్తున్న విధానమేనని కొంతమంది భావిస్తున్నారు. కొన్ని ఆఫర్లు వచ్చినా? పాత్రలు నచ్చకపోవడంతో తానే వదులుకుందనే మాట బలంగా వినిపిస్తోంది.





కుటుంబాలు ఎలా ఉండకూడదో చెప్పిన స్టార్ హీరో వైఫ్!

నేటి కుటుంబ వ్యవస్థలో వచ్చిన చాలా మార్పులు మానసిక అశాంతికి, చివరికి కలతలకు దారి తీస్తున్న సంగతి తెలిసిందే. జంటలు బ్రేకప్ అవ్వడానికి వారి మధ్య సరైన బాంధవ్యం లేకపోవడమేనని కౌన్సిలర్లు చెబుతున్నారు. పెద్ద కుటుంబాల విభజన కూడా దీనికి ఒక కారణం. కుటుంబంలో పది మంది ఒక చోట ఆనందంగా జీవించడం.. కుటుంబ పెద్ద చెప్పిన దానిని తూ.చ తప్పక అనుసరించడం వంటి చాలా విషయాలు ఈరోజుల్లో లేవు. జెన్ జి పెద్దల మాటను పెడచెవిన పెడుతున్నారనే ఆరోపణ ఉంది. అయితే వీటన్నిటి నుంచి బయటపడేందుకు తాము అనుసరిస్తున్న ఒక విధానం గురించి స్టార్ హీరో సిద్ధార్థ్ సతీమణి, మేటి కథానాయిక అతిదీరావ్ హైదరీ చెప్పుకొచ్చిన విషయాలు ఆసక్తిని కలిగించాయి. ముఖ్యంగా తన కుటుంబంలో.. తన భర్త సిద్ధార్థ్ కుటుంబంలో ప్రత్యేక విలువలు, సంప్రదాయాల గురించి మనసు విప్పి మాట్లాడారు. కలిసి నవ్వుకోవడం.. కలిసి భోజనం చేయడం వంటి చిన్నచిన్న రోజువారీ సంగతులు కుటుంబ సభ్యులను ఎలా దగ్గర చేస్తాయో.. అందరం ఒక్కటే అనే భావనను ఎలా కలిగిస్తాయో అదితీ వివరించారు. తమ ఇంట్లో ఎప్పుడూ ఏ ఇద్దరు ఎదురు పడినా, కుటుంబ సభ్యులందరూ ఒకచోట కలిసినా నవ్వుకోవడానికి ఉన్న అన్ని మార్గాలను వెతుకుతామని అన్నారు. సిద్ధ్ కుటుంబం అయినా.. తన కుటుంబీకులు అయినా.. మేమంతా ఒకరికొకరం కలుసుకున్నప్పుడు చక్కని హాస్య చతురతతో నవ్వుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఇరు కుటుంబాల్లోనూ ఉన్న ఒక ఉమ్మడి సంప్రదాయం ఇది అని తెలిపారు. పరిస్థితులు ఎలా ఉన్నా అందరూ కలిసి నవ్వుకోవడానికి ఏదో ఒక కారణాన్ని వెతుక్కుంటారని అదితి వెల్లడించారు.

అనార్కలీ చీరలో దేవతా సుందరిలా మెరిసిపోతున్న బ్యూటీ



ఆల్ఫా- లాంటి భారీ యాక్షన్ చిత్రంలో స్టంట్స్ తో అదరగొట్టింది శార్వరి. సినిమా ఆద్యంతం ఆలియా పోటీలో ఉన్నా శార్వరి ఐ క్యాచర్ గా మారింది. ఈ స్పై యాక్షన్ సినిమా తనకు విజయాన్ని ఇవ్వకపోయినా నటిగా గుర్తింపు పొందింది. అదే సమయంలో -మైన్ వాపస్ ఆవుంగా- లాంటి ప్రేమకథా చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా తన అద్భుత నటనతో మనసులు కొల్లగొట్టింది. అంతకుముందు -ముంజ్యా- లాంటి విజయం తన ఖాతాలో ఉంది. ఓవైపు కెరీర్ పరంగా బ్యాక్ టు బ్యాక్ అవకాశాలతో ముందుకు సాగుతున్నా.. ఈ బ్యూటీ ఫ్యాషన్ ప్రపంచంలోను వేవ్స్ క్రియేట్ చేయడంలో వెనకంజలో లేదు. యంగ్ బ్యూటీ శర్వారీ తన లేటెస్ట్ ట్రెడిషనల్ లుక్‌తో ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేస్తోంది. ప్రముఖ డిజైనర్లు అబు జానీ-సందీప్ ఖోస్లా డిజైన్ చేసిన లేత ఆకుపచ్చ అనార్కలీ డ్రెస్‌లో శర్వారీ రాజసం ఉట్టిపడేలా మెరిసిపోయింది. ప్రాచీన భారతీయ హస్తకళా నైపుణ్యానికి మోడ్రన్ స్టైలింగ్‌ను జోడిస్తూ.. ఈ డ్రెస్ అంతటా అల్లిన బంగారు వర్ణం ఎంబ్రాయిడరీ.. డీప్ యు -నెక్ డిజైన్ దుస్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎలాంటి హంగూ ఆర్భాటం లేని హుందాతనంతో పాటు పండుగ శోభను తలపించే గ్లామర్ కలగలిసిన ఈ అనార్కలీ దుస్తులు.. నేచురల్ మేకప్‌తో శర్వారీ కట్టిపడేస్తోంది. శార్వరి తాజా చిత్రం -యే ప్రేమ్ మోల్ లియా- ప్రమోషన్స్‌లో భాగంగా.. నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారమయ్యే -ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో-కు అంటెండయిన శార్వరి ఇలా అందంగా కనిపించింది. తాజా అవుట్‌ఫిట్ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. భారీ ఆభరణాల జోలికి వెళ్లకుండా.. కేవలం డ్రెస్ డిజైన్ - ఎంబ్రాయిడరీ వర్క్ హైలైట్ అయ్యేలా చేసిన స్టైలింగ్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. శార్వరి దేవతా సుందరిలా మెరిసిపోతోందని అభిమానులు ప్రశంసిస్తున్నారు.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA